


# విశాల భారతి

31-12-2025

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్

సంపుటి:3 సంచిక: 361


# ముక్కోటి వైభవం

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో సందడి నెలకొంది

- భక్తులు శ్రీమహా విష్ణువు దర్శనానికి పోటెత్తారు
- తిరుమల శ్రీవారి ఆలయంలో తెల్లవారుజామునే ఉత్తర ద్వారాన్ని తెరిచారు
- యాదాద్రి లక్ష్మీ నరసింహా స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు
- తిరుమలలో స్వామివారికి పూజా కైంకర్యాలు ఏకాంతంగా నిర్వహించారు
- సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులతో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు
- ఆయనకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఇతర అధికారులు స్వాగతం పలికారు






**వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని ఆలయాల్లో సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే భక్తులు శ్రీమహా విష్ణువు దర్శనానికి పోటెత్తారు. ఉత్తర ద్వార దర్శనాలు చేసుకుంటున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలో తెల్లవారుజామునే ఉత్తర ద్వారాన్ని తెరిచారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకుంటున్నారు. యాదాద్రి లక్ష్మీ నరసింహా స్వామి ఆలయం, విజయవాడ కనకదుర్గ ఆలయానికి భక్తులు పోటెత్తారు.**

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:** భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి ఆలయంలో ఘనంగా వైకుంఠ ద్వార దర్శనం వేడుక ప్రారంభమైంది. ఉత్తర ద్వార దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చారు. గరుడ వాహనంపై శ్రీరామచంద్రస్వామి వారు, గజ వాహనంపై సీతమ్మ, హనుమత్ వాహనంపై లక్ష్మణ స్వామి దర్శనమిచ్చారు. తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వామివారికి అర్చకులు పూజా కైంకర్యాలు ఏకాంతంగా నిర్వహించారు. అనంతరం మంగళవారం తెల్లవారుజామున 1.30 గంటలకు వైకుంఠద్వారాలు తెరచుకున్నాయి. మొదట వీఐపీలు, ఉదయం 6 గంటల నుంచి సామాన్యులకు వైకుంఠద్వార దర్శనాన్ని తితిదే ప్రారంభిస్తోంది. జనవరి 8న రాత్రి 12 గంటల వరకు, పది రోజుల పాటు ఈ దర్శనం కల్పిస్తున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు తిరుమలకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

మిగతా 3లో..

# తాగుదాం.. తాగి ఊగుదాం!

- మరి కొన్ని గంటల్లో 2025 సంవత్సరం ముగిసిపోతుంది
- 2026కు ఆహ్వానం పలికేందుకు హైదరాబాద్ రెడీ అవుతోంది
- ఈ సందర్భంగా రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుంది
- అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం షాపులు ఓపెన్ ఉంటాయి
- బార్లు, క్లబ్‌లు, ఈవెంట్లకు అర్ధరాత్రి 1 గంట వరకు అనుమతి
- కఠిన చర్యలు అమలు చేయనున్నట్లు పోలీసులు ప్రకటించారు
- మద్యం సేవించి వాహనం నడిపితేరూ.15 వేల జరిమానా
- రెండేళ్ల జైలు శిక్ష విధిస్తామని పోలీసులు స్పష్టం



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:** మరి కొన్ని గంటల్లో 2025 సంవత్సరం ముగిసిపోతుంది. 2026 కొత్త సంవత్సరం అడుగుపెడుతుంది. పాత ఏడాదికి వీడ్కోలు పలికి.. కొత్త జోష్‌తో నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికేందుకు హైదరాబాద్ మహానగరం రెడీ అవుతోంది. డిసెంబర్ 31 సాయంత్రం నుంచే వేడుకలు మొదలవుతాయి. ఇక ఇయర్ ఎండ్.. కొత్త సంవత్సరం సందర్భంగా రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుంది. 24 గంటల పాటు మందు బాబులు మద్యం మత్తులోనే ఉంటారు. పైగా ఈ సంవత్సరం తెలంగాణ ప్రభుత్వం మద్యం విక్రయాల సమయాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. డిసెంబర్ 31న అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం షాపులు తెరిచి ఉంచవచ్చు.

మిగతా 3లో..



## భారీగా పెరిగిన నమ్మక ద్రోహం కేసులు

- శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు
- రాష్ట్రంలో ఈ ఏడాది నేరాల సంఖ్య 2.33 శాతం తగ్గిందని వెల్లడించారు
- 2025 సంవత్సరంలో 2.28,69 కేసులు నమోదయ్యాయని తెలిపారు

03

# గ్రూప్1పై ఉత్కంఠ


- తెలంగాణలో గ్రూప్-1 కేసులో హైకోర్టులో వాదనలు ముగిశాయి
- గతంలో గ్రూప్-1 ఫలితాలను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చింది
- ఈ తీర్పును సవాల్ చేస్తూ పలువురు అప్పీళ్లు దాఖలు చేశారు
- ఈ అప్పీళ్లపై మంగళవారం హైకోర్టులో విచారణ ముగిసింది
- జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ జనవరి 22న తీర్పు వాయిదా వేశారు
- మార్కుల జాబితాలో అవకతవకలు జరిగాయని అభ్యర్థులు ఆరోపణ

02



# సంక్రాంతికి టోల్ ఫ్రీ ప్రయాణం

## సంక్రాంతికి టోల్ గేట్లను నిలిపివేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది



- రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ఏఐకు లేఖ రాయాలని నిర్ణయం తీసుకుంది
- కోమటిరెడ్డి వెంకటరెడ్డి టోల్ ఫీజు మినహాయింపు ఇవ్వాలని కోరారు
- ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు
- తిరుమలలో స్వామివారికి పూజా కైంకర్యాలు ఏకాంతంగా నిర్వహించారు
- జనవరి 9 నుంచి 18 వరకు టోల్ ఫీజు మినహాయించాలని వెల్లడించారు
- సచివాలయంలో మంత్రి కోమటిరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు


**విశాలభారతి,స్టేట్ బ్యూరో:** హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారిపై సంక్రాంతి పండగ రోజుల్లో టోల్ గేట్ల నిర్వహణను నిలిపివేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఇందులో భాగంగా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ)కు లేఖ రాయాలని నిర్ణయం తీసుకుంది. ప్రతీ సంవత్సరం సంక్రాంతి పండగ సమయంలో హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజాల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. ప్రస్తుతం ఫ్లై ఓవర్లు, వంతెనలు, అండర్‌పాస్‌లు, సర్వీసు రోడ్ల పనులు జరుగుతుండటంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రం అయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 3, 4 రోజుల పాటు టోల్ గేట్ల నిర్వహణను ఆపాలని రాష్ట్రం ప్రభుత్వం అనుకుంటోంది.

మిగతా 2లో..

# నీళ్లపై సోయేదీ..?

- ఏపీతెలంగాణ నీటిని దొంగిలించడమేనని హరీష్ రావు ఆరోపించారు
- బనకచర్ల ప్రాజెక్టును నల్లమల సాగర్ కిందకు మార్చిందని అన్నారు
- తెలంగాణ హక్కులను కాలరాసే జల దోపిడీ అని అభివర్ణించారు
- అక్రమ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబే సూత్రధారని మండిపడ్డారు
- సీఎం రేవంత్ రెడ్డి పాత్రధారిగా జల ద్రోహం చేస్తున్నారని అన్నారు
- పొరుగు రాష్ట్రాలు నీటి వాటా కోసం గట్టిగా పోరాడుతున్నాయి
- ఇది తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టని స్పష్టం చేశారు

02



# సీఎం ప్రగతి మంత్రం



- జోనల్ కమిషనర్లతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం
- ఎకానమీ ఏరియాను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలని తెలిపారు
- పరిపాలనను పట్టాలెక్కించాలనేదే తమ ఆలోచన అని అన్నారు
- కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని పేర్కొన్నారు
- సీఎం రేవంత్ రెడ్డి పాత్రధారిగా జల ద్రోహం చేస్తున్నారని అన్నారు
- చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలన్నారు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:** జోనల్ కమిషనర్లు ప్రతీ రోజు ఫీల్డ్‌లో ఉండాల్సిందేనని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ ఏరియాను ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకోవాలనే తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేసుకున్నామని వ్యాఖ్యానించారు. మంగళవారం కమాండ్ కంట్రోల్

మిగతా 2లో..

## రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

- పలువురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది
- నియామకాలకు సంబంధించి కీలక ఉత్తర్వులు జారీ చేసింది
- పరిపాలనా వ్యవస్థను సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో మార్పులు
- జీహెచ్ఎంసీ, జిల్లా కలెక్టర్ పదవులు, కీలక శాఖల కమిషనర్ పోస్టులు
- జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్లుగా శ్రీజన, వినయ్‌లను నియమించింది
- పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి శృతి ఓజా

03

# నీళ్లపై సోయేదీ..?



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

ఏపీ ప్రభుత్వం గతంలో ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టును ప్రస్తుతం నల్లమల సాగర్ కిందకు మార్చిందని, ఇది కేవలం పేరు మార్పు మాత్రమే తప్ప లక్ష్యం మాత్రం తెలంగాణ నీటిని దొంగిలించడమేనని హరీష్ రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో హరీష్ రావు ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిన నల్లమల సాగర్ ప్రాజెక్టుపై, అలాగే రాష్ట్ర ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. ఇది కేవలం నీటి తరలింపు కాదని, తెలంగాణ హక్కులను కాలరాసే జల దోపిడీ అని అభివర్ణించారు. నల్లమల సాగర్ అక్రమ ప్రాజెక్టుకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సూత్రధారి అయితే, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాత్రధారిగా మారి జల ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటక, మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాలు తమ నీటి వాటా కోసం గట్టిగా పోరాడుతుంటే, రేవంత్ రెడ్డి మాత్రం చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించే పనిలో ఉన్నారని మండిపడ్డారు. తెలంగాణ నీటి పారుదల శాఖ సలహాదారుగా మాజీ అధికారి ఆదిత్యానాథ్ దాస్ నియామకాన్ని హరీష్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. గతంలో ఏపీ సీఎస్‌గా ఉండి, తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవడానికి వందకు పైగా లేఖలు రాసిన వ్యక్తిని తీసుకొచ్చి సలహాదారుగా పెట్టుకోవడం అంటే దొంగకు తాళాలు ఇచ్చినట్లే అని విమర్శించారు. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తికి కీలక బాధ్యతలు ఇవ్వడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, ఇది తెలంగాణ ప్రయోజనాలకు గొడ్డలిపెట్టు అని ఆయన స్పష్టం చేశారు. బనకచర్ల, నల్లమల సాగర్ వివాదాల పరిష్కారానికి రెండు రాష్ట్రాల ప్రతినిధులతో కమిటీలు వేయడాన్ని హరీష్‌రావు ఒక డ్రామాగా అభివర్ణించారు. ఒకవైపు కోర్టులో కేసు వేస్తూ, మరోవైపు చర్చల కోసం కమిటీలు వేయడం వల్ల కోర్టులో కేసు వీగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కొట్టినట్లు ఉండాలి.. దెబ్బ తాకకూడదు అన్న చందంగా రేవంత్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, ఏపీ జలదోపిడీ సాగడానికి పరోక్షంగా సహకరిస్తోందని ఆరోపించారు. గోదావరి కృష్ణా అనుసంధానం ద్వారా తెలంగాణకు దక్కాల్సిన 45 టీఎంసీల వాటాను ఏపీ గంపగుత్తగా తరలించుకుపోయే ప్రయత్నం చేస్తోందని హరీష్ రావు వివరించారు. ఈ విషయంలో సీడబ్ల్యూసీ నుంచి అనుమతులు వచ్చినా తెలంగాణ ప్రభుత్వం నిద్ర నటిస్తోందని విమర్శించారు. రేవంత్ రెడ్డికి నిజంగా తెలంగాణపై ప్రేమ ఉంటే, అసెంబ్లీలో నల్లమల సాగర్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని, ఢిల్లీలోని సీడబ్ల్యూసీ కార్యాలయం ముందు ధర్నాకు రావాలని సవాల్ విసిరారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పక్షాన తామే మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. ఏపీ ప్రభుత్వం గోదావరి నీళ్లు కృష్ణా ద్వారా తరలిస్తే, గోదావరి అవార్డు ప్రకారం, 45:21:14 తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రకు కృష్ణాలో నీటి వాటా ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విధంగా కూడా తెలంగాణకు నీటి వాటా దక్కకుండా ఉండేందుకు కృష్ణాలో కలుపకుండానే, పెన్నా బేసిన్ కు గోదావరి నీటిని తరలించే పెద్ద కుట్రకు తెరతీశారన్నారు. నిజానికి పోలవరం బనకచర్ల విషయంలో కర్ణాటక, మహారాష్ట్రలు తీవ్ర అభ్యంతరాలు తెలుపుతూ లేఖలు రాశాయన్నారు. వరద జలాల మీద కట్టే ప్రాజెక్టు కట్టేందుకు ఏపీకి అవకాశం ఇస్తే అదేవిధంగా ప్రాజెక్టులు కట్టేందుకు డీపీఆర్‌లు పంపుతామని అన్నారని.. గుర్తు చేశారు. ఏపీ ప్రభుత్వం ప్లాన్ కర్ణాటక, మహారాష్ట్రకు అర్థం అయ్యింది, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రం అర్థం కాలేదన్నారు.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో ప్రతిసారి బీఆర్ఎస్ నాయకులను విమర్శించడమే సరిపోతోందని విమర్శించారు. నీటి వాటా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిద్ర పోతుందా.. నిద్ర పోతున్నట్లు నటిస్తుందా అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. తాను ఎటువంటి ఫేక్ రాజకీయాలు చేయడం లేదని స్పష్టం చేశారు. తెలంగాణతో ఉన్న అనుబంధంతోనే తాను ఇలా మాట్లాడుతున్నానని చెప్పుకొచ్చారు హరీశ్‌రావు. తెలంగాణ జలదోపిడికి సూత్రదారి ఆదిత్య నాథ్ దాస్ అని ఆరోపణలు చేశారు. తెలంగాణ ద్రోహి ఆయనేనని ఆక్షేపించారు. ఆదిత్య నాథ్ దాస్‌ను రేవంత్‌రెడ్డి సర్కార్ వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. బనకచర్ల ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ అనుమతి ఇచ్చేందుకు కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి ఎంత ధైర్యమని నిలదీశారు. బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తీర్మానం చేస్తే తాము సంపూర్ణ మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్టుపై సీడబ్ల్యూసీ అనుమతి రద్దు చేయాలని ఢిల్లీలో ధర్నా చేద్దామని హరీశ్‌రావు సూచించారు.




## ఎస్సై సురేష్ రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలి

**మాదిగ మహిళా సంఘం మునగాల మండల ఇన్చార్జి వెంపటి ప్రమీల మాదిగ**

**కోదాడ, విశాలభారతి:** మునగాలమండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు మాదిగ మహిళా సంఘం మండల ఇంచార్జీ వెంపటి ప్రమీల, షేక్ లతీబీ, రాణి గార్లు దీక్షను సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం మాదిగ మహిళాసంఘ నాయకురాలు వెంపటి ప్రమీల మాదిగ మాట్లాడుతూ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థపాక అధ్యక్షులు గౌరవ పద్మశ్రీ. మందకృష్ణ మాదిగ గారి నాయకత్వంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు మాదిగ మహిళా కమిటీ తరుపున సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. కర్ల రాజేష్‌లాకప్ డెత్ ఘటనలో ప్రధాన కారకుడు అయినా చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డే అన్నారు. అయితే ప్రధాన కారకుడుగా ఉన్న చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డిని సస్పెండ్ చేయకుండా కేవలం కోదాడ రూరల్ సిఐ ప్రతాప లింగం గారిని సస్పెండ్ చేయడం దారుణమైన చర్యను అన్నారు. కుల వివక్షతను పోలీసు ఉన్నతాధికారులు పాటిస్తున్నారని అన్నారు. చిలుకూరు ఎస్సై రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు కావడం వల్లే సస్పెండ్ చేయడం లేదు అని అన్నారు. తక్షణమే ఎస్ఐ సురేష్ రెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు ఈ డిమాండ్లను నెరవేరేంతవరకు మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్రఉపాధ్యక్షులు బోడ సునీల్ మాదిగ, ఎం.ఎస్.పి. రాష్ట్ర నాయకులు యర్ర వీరాస్వామి మాదిగ, ఎం.ఎస్.పి.జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అంజయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకోట్ల నాగరాజు మాదిగ, ఎంఎస్పి మునగాల మండల అధ్యక్షులు లంజపల్లి శ్రీను మాదిగ, విహెచ్పిఎస్ నడిగూడెం మండల అధ్యక్షులు నూకపంగు గురువయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ మండల నాయకులు ఎల్ శ్రీను, లింగరాజు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్1పై ఉత్కంఠ

**విశాలభారతి, తెలంగాణ:**



తెలంగాణలో గ్రూప్1 కేసులో హైకోర్టులో వాదనలు ముగిశాయి. గతంలో గ్రూప్1 ఫలితాలను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ టీజీపీఎస్సీతోపాటు పలువురు ఉద్యోగులు దాఖలు చేసిన అప్పీళ్లపై మంగళవారం హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరువైపులా వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ జనవరి 22న తీర్పు ఇస్తామని వెల్లడించారు. ఈ ఏడాది మూడో నెల 10న ఇచ్చిన ఫలితాల ఆధారంగా ప్రకటించిన జనరల్ ర్యాంగింక్స్ లిస్ట్, మార్కుల జాబితాలో అవకతవకలు జరిగాయని పలువురు అభ్యర్థులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ జాబితాను సింగిల్ బెంచ్ రద్దు చేసింది. ఈ తీర్పుపై టీజీపీఎస్సీ అప్పీళ్లకు వెళ్లింది. టీజీపీఎస్సీ తరపున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు. నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరీక్షలు జరిగాయని ఆయన తెలిపారు. పరీక్షల మూల్యాంకనంలో అవకతవకలు జరగకుండా ఉండేందుకే ఇద్దరి చేత మూల్యాంకనం చేయించారని తెలిపారు. గ్రూప్1 పరీక్ష కేంద్రాల పెంపు, పరిపాలనాపరమైన సౌలభ్యం కోసం ప్రిలిమ్స్, మెయిన్స్‌లకు హాల్‌టికెట్లను ఇచ్చినట్లు వెల్లడించారు. ఉద్యోగానికి అర్హత సాధించిన అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాది ప్రకాశ్ రెడ్డి వాదనలు వినిపించారు. పరీక్షల్లో అర్హత సాధించలేనివారు కోర్టును ఆశ్రయించారన్నారు. గ్రూప్1 పరీక్షలకు రెండు హాల్‌టికెట్లు ఉంటాయని పరీక్షలకు ముందే టీజీపీఎస్సీ వెల్లడించిదని పేర్కొన్నారు. అప్పుడు అభ్యంతరం చెప్పకుండా, ఫలితాలు విడుదలయ్యాక పిటిషన్ వేయడం చెల్లదని ఆయన చెప్పారు. దీంతో ఇరువురి వాదనలు విన్న జస్టిస్ ఈ కేసును జనవరి 22కు వాయిదా వేశారు. గతంలో ఈ పరీక్షలపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర తీర్పుపై జోక్యం చేసుకునేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. నియామకాలపై హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై.. ఈ దశలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. ఈ విషయంపై హైకోర్టు డివిజన్ బెంచ్ ముందు ఈనెల 15న విచారణ జరగనున్న నేపథ్యంలో తాము కలిగించుకోలేమని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సవావల్ చేస్తూ.. వేముల అనుష్ వేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు వేసిన పిటిషన్‌పై అక్టోబర్ 7 కూడా సుప్రీం ధర్మాసనం విచారణ చేపట్టింది. గ్రూప్ 1 నియామకాలపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. నియమాకాలు హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చే తుది ఉత్తర్వులకు లోబడే ఉంటాయన్న విషయాన్ని.. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్.. అభ్యర్థులకు స్పష్టంగా చెప్పాలని టీజీపీఎస్సీని ఆదేశించింది. హైకోర్టు డివిజన్ బెంచ్ ముందు అక్టోబర్ 15న తుది విచారణ జరిగే సమయంలో.. తాము జోక్యం చేసుకోలేమని చెప్పింది. తాజాగా మళ్లీ ఇదే విషయాన్ని చెప్పింది సుప్రీం కోర్టు. దీంతో తెలంగాణ ప్రభుత్వానికి మరోసారి ఊరట లభించింది. గ్రూప్1 పరీక్షల నిర్వహణలో అవకతవకలు, పేపర్ లీకుల వల్ల 2022 నుంచి నియామకాలు జరగలేదు. 2023లో ప్రభుత్వం మారిన తర్వాత 563 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చింది. 2024 జూన్‌లో ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించారు. అదే ఏడాది అక్టోబర్ 27న మెయిన్స్ పరీక్ష జరిగింది. 2025 మార్చి 10న ఫలితాలు వెల్లడించింది ప్రభుత్వం. అయితే మూల్యాంకన సమయంలో అవకతవకలు జరిగాయని పలువురు అభ్యర్థులు కోర్టు మెట్లు ఎక్కారు. దీంతో నియమాకాలు ఆగిపోయాయి. ఈ వివాదం ముగిసేంతవరకు నియామక పత్రాలు ఇవ్వొద్దని తెలంగాణ హైకోర్టు.. కమిషన్‌ను ఆదేశించింది.

2025 సెప్టెంబర్ 10న.. తెలంగాణ హైకోర్టు సింగ్ జడ్జ్ బెంచ్.. గ్రూప్1 పరీక్షల మార్కుల లిస్ట్, ర్యాంకింగ్ లిస్టులను రద్దు చేసింది. మాన్యువల్ పద్ధతిలో రీవాల్యుయేషన్ చేయాలని ఆదేశించింది. రీవాల్యుయేషన్ పూర్తి చేసి.. ఆదేశాలు జారీ చేసిన 8 నెలల్లో నియామకాలు చేపట్టాలని చెప్పింది. లేదంటే మళ్లీ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. అయితే ఈ సింగిల్ బెంచ్ తీర్పుపై.. టీజీపీఎస్సీ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై హైకోర్టు డివిజన్ బెంచ్ సెప్టెంబర్ 24 స్టే విధించింది. గ్రూప్1 నియామకాలు చేపట్టుకోవచ్చని చెప్పింది.

# సీఎం ప్రగతి మంత్రం

( మొదటిపేజీ తరువాయి )

సెంటర్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలమెంట్ విభాగం అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్షలో కొత్త జోనల్ కమిషనర్లకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. క్యూర్ పరిధిలోని సిటీని 12 జోన్లు, 60 సర్కిళ్లు, 300 వార్డులుగా పునర్వ్యవస్థీకరించామని చెప్పుకొచ్చారు. పరిపాలనను పట్టాలెక్కించాలనేదే తమ ఆలోచన అని తెలిపారు. హైదరాబాద్ నగరంలో అత్యంత సంక్లిష్టమైన సమస్య చెత్త నిర్వహణ అని వివరించారు. కోర్ అర్బన్ రీజియన్‌ను ప్రక్షాళన చేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. జోన్‌ల వారీగా సంబంధిత సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత జోనల్ కమిషనర్‌లదేనని స్పష్టం చేశారు. సిటీలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని నిర్ణయించామని పేర్కొన్నారు. చెరువులు, నాలాలను ఆక్రమణల నుంచి కాపాడుకోవాలని మార్గనిర్దేశం చేశారు. క్యూర్ పరిధిలో డీజిల్ బస్సులు, ఆటోల స్థానంలో ఈవీ వాహనాలను తీసుకురావాలని నిర్ణయించామని తెలిపారు. సిటీలో కాలుష్య నియంత్రణకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్షాళన తీసుకుంటున్నామని వెల్లడించారు సీఎం రేవంత్‌రెడ్డి.

చెరువులు, నాలాలు, చెత్త డంపింగ్ ఏరియాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నెలకు మూడు రోజులు శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. రోడ్లపై ఎక్కడా చెత్త కనిపించడానికి వీల్లేదని హుకుం జారీ చేశారు. అలాగే, రోడ్లపై గుంతలు కనిపించొద్దని సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ, ట్రేడ్ లైసెన్సులు, ఇతర ధ్రువపత్రాల జారీకి టెక్నాలజీని ఉపయోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని మార్గనిర్దేశం చేశారు. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్‌లతో కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోవాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. గుడ్ గవర్నెన్స్ నుంచి స్మార్ట్ గవర్నెన్స్‌కు మారాలని దిశానిర్దేశం చేశారు. హైడ్రా, జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ విభాగాలు నాలాల పూడిక తీత పనులు జనవరి నుంచి ప్రారంభించాలని నిర్దేశించారు. నగరంలో వీధి దీపాలు సరిపడా ఉండేలా చూసుకోవాలని సూచించారు. క్యూర్ ఏరియాలో ఆయా విభాగాల అధికారులను సమన్వయం చేసే బాధ్యత స్పెషల్ సీఎస్ చూసుకుంటారని పేర్కొన్నారు. దోమల నివారణ, అంటువ్యాధులు ప్రబలకుండా జోనల్ కమిషనర్ ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతీ పది రోజులకోసారి గార్బేజ్ క్లియరెన్స్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఎక్కడ సమస్య తలెత్తినా పరిష్కరించేందుకు టోల్ ఫ్రీ నంబర్‌కు వీలైనంత స్పీడ్‌గా రెస్పాన్స్ అవ్వాలని మార్గనిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో వచ్చే ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని సూచించారు. అధికారులు అందరూ కలిసి పనిచేస్తేనే నగరం భవిష్యత్ బాగుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



పాలనలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్లు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లను భాగస్వాములను చేయాలని, వారితో నిరంతరం కమ్యూనికేషన్ కొనసాగించాలని సీఎం సూచించారు. దోమల నివారణ, అంటువ్యాధుల నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వీధి దీపాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకూడదని హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్‌కు వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశిస్తూ, రాబోయే ఐదేళ్ల కాలానికి పక్కా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) స్టాండింగ్ కమిటీ రూ.11,460 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించింది. ప్రధానంగా రోడ్డు మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం మెరుగుదలపై దృష్టి సారించింది. మునుపటి జీహెచ్ఎంసీ కోసం 202526 సంవత్సరానికి రూ.11,010 కోట్ల సవరించిన అంచనాలను కూడా కమిటీ ఆమోదించింది. 11,460 కోట్ల రూపాయల బడ్జెట్‌లో ఎక్కువ భాగం రోడ్లు, వంతెనలు, ప్రధాన రహదారులను సరిగా మెయింటేనే చేసే సమగ్ర రహదారి నిర్వహణ కార్యక్రమం(సీఆర్ఎంపీ), హైదరాబాద్ సిటీ ఇన్నోవేషన్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్‌సీఐటీఐ) ప్రాజెక్టులకు కేటాయింపులు ఉన్నాయి.



## ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణం నిలిపివేయాలంటూ నిరసన

**గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రజలు**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** అబ్దుల్లాపూర్మెట్ మండలం పసుమాముల గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 128లో హెచ్ఎం డబ్ల్యూ & ఎస్ ఎస్ బి ఆధ్వర్యంలో చేపడుతున్న ఎస్టీపీ (సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) నిర్మాణ పనులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ రైతులు, గ్రామ పెద్దలు, యువకులు ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణ స్థలానికి చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, పసుమాముల గ్రామంలో ఉన్న రెండు చెరువులు మురుగునీటి వ్యర్థాలతో నిండిపోవడంతో గత 15 సంవత్సరాలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ నరకయాతన అనుభవిస్తున్నారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ట్రంక్ లైన్ ద్వారా వచ్చే మురుగునీరు చెరువుల్లోకి చేరడం వల్ల దుర్వాసన, దోమల బెడద, కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని వారు వివరించారు. ఇప్పటికే అనేక సమస్యలతో బాధపడుతున్న గ్రామంలో మళ్లీ ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణం చేపడితే పరిస్థితి మరింత విషమిస్తుందని హెచ్చరించారు. అందుకే పసుమాముల గ్రామంలోని రెండు చెరువుల్లోకి వెళ్లే మురుగునీటిని ట్రంక్ లైన్ ద్వారా మూసివేసి, మూసివేసిన కాలువ (క్లోజ్డ్ డ్రెయిన్) ద్వారా తరలించే శాశ్వత పరిష్కారం చూపే వరకు గ్రామ పరిధిలో ఎలాంటి నిర్మాణ పనులు చేపట్టకూడదని అధికారులను కోరారు. గ్రామ ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో గ్రామ ప్రజలు ఐక్యంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు

హెచ్ఎం డబ్ల్యూ & ఎస్ ఎస్ బి సిజియం సుజాత, శివ రేంజ్ బోర్డు జనరల్ మేనేజర్ వసంత, జిహెచ్ఎంసి నాగోల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ రెడ్డి, డీఈ సుమంత్, పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రైతు సహకార సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి, పసుమాముల గ్రామ మాజీ సర్పంచ్ శంకరయ్య గౌడ్, సత్యనారాయణ గౌడ్, మాజీ కౌన్సిలర్ జంగయ్య గౌడ్, అలాగే బాబు, రాజు, వాసు, రూపేష్, రవీందర్తో పాటు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు, రైతులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# తాగుదాం.. తాగి ఊగుదాం!

( మొదటిపేజీ తరువాయి )

ఈక్రమంలో న్యూఇయర్ మద్యం అమ్మకాలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం మంగళవారం ప్రత్యేక జీవో జారీ చేసింది. డిసెంబర్ 31 సందర్భంగా.. బుధవారం అర్ధరాత్రి 12 దాకా మద్యం అమ్మకాలకు సంబంధించి మద్యం దుకాణాలకు అనుమతి ఇస్తున్నట్లు ఈ జీవోలో పేర్కొంది. అలాగే.. బార్లు, క్లబ్‌లతో పాటుగా ఈవెంట్లు నిర్వహించేందుకు అనుమతి తీసుకున్నవారికి కూడా అర్ధరాత్రి 1 గంట వరకు మద్యం అమ్మకానికి అనుమతి ఇస్తున్నట్లు జీవోలో పేర్కొంది. కొత్త ఏడాది వేడుకలకు మద్యం అమ్మకాలపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక జీవో ఇవ్వడంతో పాటు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ.. నేడు, రేపు ప్రత్యేక తనిఖీలు నిర్వహించనుంది. ఇదిలా ఉంటే.. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో ఇప్పటికే చాలా చోట్ల పాత ఏడాదికి వీడ్కోలు పలికి.. నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రాజధాని శివారు ప్రాంతంలో పెద్ద ఎత్తున ఈవెంట్లు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు అబ్కారీ శాఖ చెబుతోంది. కొత్త సంవత్సరం సందర్భంగా ఈ ఏడాది కూడా కోట్ల రూపాయల మేర మద్యం అమ్మకాలు సాగుతాయని రాష్ట్ర ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ అంచనా వేస్తుంది.

అయితే.. న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ట్రాఫిక్ పోలీస్ కీలక ట్రాఫిక్ అడ్వైజరీ విడుదల చేశారు. డిసెంబర్ 31 రాత్రి 8 గంటల నుంచి సైబరాబాద్ పరిధి అంతటా కఠిన చర్యలు అమలు చేయనున్నట్లు పోలీసులు ప్రకటించారు. క్యాబ్, టాక్సీ, ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించి, అవసరమైన డాక్యుమెంట్లు వెంట తీసుకెళ్లాలని సూచించారు. ప్రయాణికులను ఎక్కించుకోనని నిరాకరించడం నేరమని, అధిక చార్జీలు వసూలు చేసినా, దురుసుగా ప్రవర్తించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రయాణికుల ఫిర్యాదుల కోసం ప్రత్యేక వాట్సాప్ నంబర్



9490617346ను అందుబాటులో ఉంచారు. బార్లు, పబ్బులు, క్లబ్బుల యాజమాన్యాలకు కూడా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మద్యం సేవించిన కస్టమర్లను వాహనాలు నడపనివ్వకూడదని, అలా జరిగితే యాజమాన్యంపై సహకరించినట్లు కేసులు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. కస్టమర్లకు అవగాహన కల్పించి, సురక్షిత రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సాధారణ ప్రజల కోసం ప్రత్యేక కెమెరాలతో నిఘా పెంచారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, ఓవర్ స్పీడింగ్, రాష్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణం, తప్పు పార్కింగ్ వంటి ఉల్లంఘనలపై వెంటనే చర్యలు తీసుకుంటారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తారు. డాక్యుమెంట్లు చూపించని వాహనాలను డిటైన్ చేస్తారు. అధిక శబ్దంతో మ్యూజిక్, నంబర్ ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేస్తారు. మైనర్లు వాహనాలు నడిపితే వాహన స్వాధీనంతో పాటు కేసులు నమోదు చేస్తారు. మద్యం సేవించి వాహనం నడిపితే మొదటి సారి రూ.10 వేల జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష, మళ్లీ చేస్తే రూ.15 వేల జరిమానా లేదా రెండేళ్ల జైలు శిక్ష విధిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ సస్పెన్షన్ లేదా శాశ్వత రద్దు కూడా చేస్తామని హెచ్చరించారు. మద్యం మత్తులో ప్రాణాంతక ప్రమాదం జరిగితే బీఎన్ఎస్ 2023 ప్రకారం అరెస్టు చేస్తామని తెలిపారు. బాధ్యతాయుతంగా న్యూఇయర్ వేడుకలు జరుపుకోవాలని, రోడ్డుపై ప్రతి ఒక్కరి భద్రతకే ఈ చర్యలని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సెలబ్రేట్ రెస్పాన్సిబ్లీ.. డ్రైవ్ సేఫ్లీ.. హోమ్ సేఫ్‌గా చేరండని అనే నినాదంతో ముందుకెళ్తున్నారు ట్రాఫిక్ పోలీసులు.

హైదరాబాద్లో నూతన సంవత్సర వేడుకల వేళ పోలీస్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఈగల్ టీమ్ కఠిన చర్యలకు సిద్ధమైంది. డిసెంబరు 31వ తేదీ రాత్రి నగరవ్యాప్తంగా ముమ్మరంగా డ్రగ్ టెస్టులు నిర్వహించనున్నట్టు ఈగల్ టీం ఎస్పీ గిరిధర్ రావుల వెల్లడించారు. యువత పెడదారిన పడకుండా, వేడుకలు ప్రశాంతంగా జరుపుకునేలా చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడం కోసం 150 మంది సభ్యులతో కూడిన 12 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించుతున్నామని ఆయన




పేర్కొన్నారు. హైదరాబాద్ వ్యాప్తంగా పబ్ లు, క్లబ్ లు, రిసార్ట్ లు, శివార్లలో ఉన్న ఫామ్ హౌస్ ల పైన ప్రత్యేక నిఘా ఉంచుతున్నట్టు పేర్కొన్నారు.

ఎక్కడ అనుమానం వచ్చినా వెంటనే తనిఖీలు చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, సంతోషంగా జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసిన యాంటీ నార్కోటిక్ బ్యూరో ఈగల్ టీం ఎస్పీ గిరిధర్ రావుల ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తూ, లేదా సరఫరా చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. ఈ సంవత్సరం తనిఖీలలో ప్రధాన దృష్టి డీజే ఆపరేటర్లపై ఉండా డీజే నిర్వాహకులపై ఈసారి టెస్ట్ లు ప్రారంభిస్తున్నట్టు ఈగల్ టీం ఎస్పీ తెలిపారు. పబ్ లలో తనిఖీలు ప్రారంభించగానే డీజే ఆపరేటర్లకు డ్రగ్ టెస్ట్ చేస్తామని ఇతర సిబ్బందికి అనుమానిత వ్యక్తులకు పరీక్షలు నిర్వహిస్తామని, డ్రగ్ సరఫరాలో కానీ వినియోగంలో కానీ డీజేల పాత్ర ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫామ్ హౌస్ పార్టీల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే యజమానుల పైన కూడా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈసారి తనిఖీలలో డ్రగ్స్ టెస్ట్ కిట్లను ఉపయోగిస్తున్నట్లు, సలైవా డ్రగ్ టెస్ట్ తో కేవలం కొద్ది నిమిషాలలోనే వ్యక్తి డ్రగ్ తీసుకున్నారో లేదో నిర్ధారణ అవుతుందని ఎస్పీ గిరిధర్ తెలిపారు ఒకవేళ పరీక్షలో పాజిటివ్ అని తేలితే సదరు వ్యక్తిపై ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కఠినమైన కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. న్యూ ఇయర్ పార్టీస్ లో డ్రగ్స్ వాడితే కటకటాలు లెక్క పెట్టాల్సిందేనని సాలిడ్ వార్నింగ్ ఇచ్చారు.

# ముక్కోటి వైభవం









( మొదటిపేజీ తరువాయి )

తిరుమలలో వైకుంఠద్వార దర్శనాలు సోమవారం తెల్లవారుజామున 1.30 గంటల నుంచి ప్రారంభమయ్యాయి. రేవంత్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకొని ఉత్తర ద్వారం గుండా బయటకు వచ్చారు. అంతకుముందు ఆలయానికి వచ్చిన ఆయనకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఇతర అధికారులు స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనాలిచ్చారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారిని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, సినీనటుడు చిరంజీవి, ఆయన కుటుంబ సభ్యులు, భారత్ బయోటెక్ ఎండీ కృష్ణ ఎల్లా, తితిదే బోర్డు సభ్యురాలు సుచిత్ర ఎల్లా, సినీనటుడు నారా రోహిత్ దంపతులు, క్రికెటర్ తిలక్ వర్మ, సినీ నిర్మాత డీవీవీ దానయ్య తదితరులు దర్శించుకున్నారు.

పరమ పావన పుణ్యరోజు లక్కీ డిప్ ద్వారా మాత్రమే స్వామి దర్శనం కలుగుతుంది సాధారణ దర్శనం లేని పరిస్థితి నెలకొంది..అయితే టికెట్ లేక పోయినా స్వామివారి కొండలు స్వామివారి గోపురం చూస్తే చాలు అన్న విధంగా భక్తులు ఆ ప్రాంతానికి చేరుకుని వారి రెండు చేతులతో గోపిరాన్ని దర్శించుకుని చుట్టుపక్కల ఉన్న ఆలయాల దర్శించి వెను తిరుగుతున్న పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి, కటాక్షించు తండ్రి అంటూ స్వామిని వేడుకుంటున్నారు, ఏది ఏమైనా గతపరిస్థితుల రీత్యా లకిడిప్ పెట్టడం ఒకరకంగా మంచిదని చెప్పుకోవచ్చు. ఒకేసారి భక్తుల్ని దర్శనానికి వదిలిన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో దేవస్థానం లక్కిడిప్ అనే విధానం ఈ ఏడాది తీసుకొచ్చింది. మరోపక్క వసతి గదులు దొరకక భక్తులు కాస్త తిరుమల లో ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు ఎదురవుతున్నాయి. అయినప్పటికీ ఎప్పటికప్పుడు తిరుమలలో జరుగుతున్న విషయాలు పై కార్య నిర్వాహణాధికారి చైర్మన్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలియజేశారు.

వైకుంఠ ఏకాదశి వస్తోందంటే భక్తులకు మొదటగా గుర్తుకు వచ్చేది ఉత్తర ద్వార దర్శనమే. వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేకించి ఏర్పాటు చేసిన ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకుంటే మోక్షం ప్రాప్తిస్తుందని తీర్థజనుల విశ్వాసం. క్షీర సాగరంలో శేష తల్పంపై శయనించిన శ్రీమహా విష్ణువును దర్శించుకునేందుకు ముక్కోటి దేవతలంతా ఈ ఏకాదశి నాడు వైకుంఠానికి చేరుకుంటారు. అందుకే దీనిని ముక్కోటి ఏకాదశి అని కూడా వ్యవహరిస్తారు. వైకుంఠంలో ఏకాదశి పర్వదినాన విష్ణుమూర్తిని దర్శించుకోవడమే ప్రధాన ఘట్టం కావడంతో వైకుంఠ ఏకాదశి అన్న మరో నామాంతరమూ దీనికి ఉంది. ఇదే రోజున మధుకైటభులు అనే రాక్షసులు మహావిష్ణువును వైకుంఠంలో దర్శించుకోవడం వల్ల వారికి శాప విమోచనం కలిగిందని పురాణాలు వెల్లడిస్తున్నాయి. ఇక నుంచి ఎవరైతే ఆ వైకుంఠ ద్వారాన్ని పోలిన ఉత్తర ద్వారంలో విష్ణువును దర్శిస్తారో వారందరికీ తమలాగే మోక్షం కలగాలని మధుకైటభులు కోరుకోవడం వల్ల ఉత్తర ద్వార దర్శనానికి ఇంతటి ప్రాశస్త్యం ఏర్పడింది. తనను దర్శించుకునే భక్తులను అనుగ్రహించేందుకు ముక్కోటి దేవతలతో కలిసి విష్ణుమూర్తి వైకుంఠ ఏకాదశినాడు భువికి చేరుకుంటాడని ప్రతీతి.

# రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

**విశాలభారతి, తెలంగాణ:**

తెలంగాణ రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీలు, నియామకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ మార్పులు చేపట్టినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ బదిలీల్లో జీహెచ్ఎంసీ, జిల్లా కలెక్టర్ పదవులు, కీలక శాఖల కమిషనర్ పోస్టులు ఉన్నాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అదనపు కమిషనర్లుగా ఐఏఎస్ అధికారులు జి. శ్రీజన, వినయ్ కృష్ణారెడ్డిని రాష్ట్ర సర్కార్ నియమించింది. హైదరాబాద్ నగర పరిపాలన మరింత సమర్థవంతంగా ఉండేందుకు ఈ నియామకాలు దోహదపడతాయని అధికారులు భావిస్తున్నారు. నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక వంటి అంశాల్లో వీరి పాత్ర కీలకంగా ఉండనుంది. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి శృతి ఓజాను నియమించింది. గ్రామీణ అభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థల పర్యవేక్షణ, గ్రామస్థాయి పరిపాలన బలోపేతం దిశగా ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. గ్రామీణ మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. జిల్లా స్థాయిలో కూడా కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. నల్గొండ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారి ఇలా త్రిపాఠిని బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెను నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా నియమించింది. నిజామాబాద్ జిల్లాలో పరిపాలనా వ్యవస్థను మరింత పటిష్టం



చేయడం ఆమె ప్రధాన బాధ్యతగా ఉండనుంది. నల్గొండ జిల్లా నూతన కలెక్టర్‌గా బడుగు చంద్రశేఖర్‌ను నియమించింది. జిల్లా అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు. నల్గొండ జిల్లాలో సాగునీరు, వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి వంటి రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇక నారాయణపేట జిల్లాలో అదనపు కలెక్టర్‌గా ఉమాశంకర్ ప్రసాద్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. జిల్లా పరిపాలనలో అదనపు కలెక్టర్ పాత్ర కీలకమైన నేపథ్యంలో, అభివృద్ధి పనులు, రెవెన్యూ వ్యవహారాలు, సంక్షేమ పథకాల అమల్లో ఆయన కీలకంగా వ్యవహరించనున్నారు. ఈ బదిలీలు, నియామకాలు తెలంగాణ రాష్ట్ర పరిపాలనలో కొత్త ఉత్సాహాన్ని తీసుకువస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడం, పరిపాలనలో వేగం పెంచడం, బాధ్యతాయుత పాలనను బలోపేతం చేయడమే ఈ మార్పుల లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు. తాజా ఐఏఎస్ బదిలీలతో తెలంగాణలో పరిపాలనా వ్యవస్థ మరింత పటిష్టంగా మారుతుందని, జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు అభివృద్ధి కార్యక్రమాలకు ఎంతో ప్రయోజనమని అధికారులు అభిప్రాయపడుతున్నారు. నాలుగు రోజుల క్రితం జీహెచ్ఎంసీలో జోన్ల సంఖ్యను 6 నుంచి 12కు పెంచిన నేపథ్యంలో, వీటికి 12 మంది జోనల్ కమిషనర్లను నియమించారు. ఇందులో భాగంగా, రాధికాగుప్తాను ఉప్పల్ జోనల్ కమిషనర్‌గా బదిలీ చేయడంతో పాటు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎస్సీ కార్పొరేషన్‌లో జీఎంగా పనిచేస్తున్న డి. హన్మంతునాయక్‌కు కార్పొరేషన్ వీసీ, ఎండీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక గత కొంతకాలంగా పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న జి. జితేందర్ రెడ్డిని హైదరాబాద్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా నియమించారు. సిరిసిల్ల కలెక్టర్‌గా ఉన్న ఎం. హరితను టీజీపీఎస్సీ కార్యదర్శిగా బదిలీ చేశారు. అదే జిల్లాకు అదనపు కలెక్టర్‌గా ఉన్న గరిమా అగర్వాల్‌కు సిరిసిల్ల కలెక్టర్‌గా పూర్తి బాధ్యతలు అప్పగించారు. ఈవీ నరసింహారెడ్డి మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా నియమించారు. నిర్మలా కాంతి వెస్లీ హ్యూమన్‌రైట్స్ కమిషన్ సెక్రటరీగా నియమితులయ్యారు. అలాగే బీ. షఫీఉల్లా (ఐఎఫ్ఎస్)కు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీగా బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# సంక్రాంతికి టోల్ ఫ్రీ ప్రయాణం

( మొదటిపేజీ తరువాయి )

కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాసిన కోమటి రెడ్డి వెంకటరెడ్డి సంక్రాంతి సందర్భంగా టోల్ ఫీజు మినహాయింపు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ విజయవాడ హైవేపై జనవరి 9 నుంచి 18 వరకు టోల్ ఫీజు మినహాయించాలని కోరారు. పండగ రోజుల్లో ట్రాఫిక్ 200 శాతం అధికంగా ఉంటుందన్న మంత్రి టోల్ గేట్ల వద్ద వాహనాలు ఆగకుండా సహకరించాలని లేఖ రాశారు.

సంక్రాంతి పండుగకి సొంతూళ్లకు వెళ్లే వారికి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టిసారించారని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. గత అనుభవాల దృష్ట్యా ముందస్తు చర్యలు తీసుకోవాలి అని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ విజయవాడ హైవే పై జనవరి 8 నుండి వాహన రద్దీ ఎక్కువ ఉంటుందని, ఈ సమయంలో రోజుకు సుమారు లక్ష వాహనాల ప్రయాణం సాగుతుందని, దీనిపై అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సంక్రాంతి పండుగ సమయంలో నేషనల్ హైవేలపై ట్రాఫిక్ రద్దీ నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సచివాలయంలో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. మంగళవారం తాను తూప్రాన్ పేట, అబ్దుల్లాపూర్ మెట్ ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్ చేస్తానని అధికారుల చర్యలను పరిశీలిస్తానని స్పష్టం చేశారు. ప్రధానంగా ఎల్బీనగర్ నుంచి వనస్థలిపురం, పనామా గోడౌన్, హయత్ నగర్, రామోజీ



ఫిల్మ్ సిటీ వంటి ప్రాంతాల్లో వేలాది వాహనాల రద్దీ ఏర్పడుతుందని, ఆయా ప్రాంతాల్లో ఎట్టి పరిస్థితుల్లో ట్రాఫిక్ ఆగడానికి వీల్లేదన్నారు. పండుగ రద్దీ ఉన్న రోజుల్లో లేన్‌లు మూసే పనులు, భారీ యంత్రాలతో చేసే పనులు చేయొద్దన్నారు. అత్యవసరంగా చేయాల్సిన పనులు ట్రాఫిక్ తక్కువగా ఉండే రాత్రి వేళల్లో మాత్రమే చేయాలన్నారు. పండుగ మొదలుకానున్న తేదీకి ముందే రోడ్లపై ఉన్న మట్టి, నిర్మాణ సామగ్రి, యంత్రాలు పూర్తిగా తొలగించాలన్నారు. అన్ని రహదారి లేన్‌లు వాహనాల రాకపోకలకు పూర్తిగా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు పనులు జరుగుతున్న ప్రతి చోట పగలు, రాత్రి స్పష్టంగా కనిపించే ట్రాఫిక్ బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. హైవిజిబిలిటీ కోన్లు, బారికేడ్లు ఏర్పాటు చేసి పనులు జరిగే ప్రాంతం, ట్రాఫిక్ వెళ్లే దారి స్పష్టంగా చూపాలని సూచించారు. ఎక్కడా ట్రాఫిక్‌కు అయోమయం కలిగించే ఏర్పాట్లు ఉండకూడదన్నారు. రద్దీ ఎక్కువగా ఉండే జంక్షన్లు, టోల్ ప్లాజాలు, కీలక ప్రాంతాల్లో అదనపు ట్రాఫిక్ పోలీసులను మోహరించాలన్నారు. ట్రాఫిక్ మళ్లింపులు, నియంత్రణ అంశాల్లో స్థానిక ట్రాఫిక్ పోలీసులతో నిరంతరం సమన్వయం పాటించాలని, అన్ని సంబంధిత శాఖలు పోలీసుల సూచనలను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు.

రోడ్డు పనుల్లో ఉన్న సిబ్బంది అందరూ ప్రతిబింబించే జాకెట్లు తప్పనిసరిగా ధరించాలని సూచించారు. రాత్రి సమయంలో జంక్షన్లు, వర్క్ జోన్‌ల వద్ద తగినంత వెలుతురు ఏర్పాటు చేయాలన్నారు. బారికేడ్లు, ట్రాఫిక్ ఐలాండ్‌లపై రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. రూట్ పేట్రోల్ వాహనాలు, క్రేన్లు, అంబులెన్సులు 24 గంటలు అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని రహదారి ఘటనలను ప్రత్యేక ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతరం పర్యవేక్షించాలని, టోల్ ప్లాజాల వద్ద వాహనాలు ఆగకుండా సజావుగా వెళ్లేలా అదనపు బృందాలను మోహరించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

## మా ఊరి తోకరి సోలాల వంటల రుచులు గుమగుమలు







- ఇప్పుడు కాదంటే మళ్లీ సంవత్సరంవరకు ఎదురు చూడాల్సిందే.
- ఉత్తర తెలంగాణలోనే ఎంతో ప్రసిద్ధిగాంచిన సోలాల బిర్యానీ నోరూరిస్తున్న పలురకాల రుచులు
- ఏ పల్లెలో ఏ ఇంట్లో చూసినాసోలాల వంటకాలే

**విశాలభారతి, ఆదిలాబాద్:** చికెన్లేదా మటన్ బిర్యానీ ఈరోజు తినకపోతే రేపుతినొచ్చు. కానీ ఈ బిర్యాని ఇప్పుడు తినకపోతేదాని రుచి కోసం మళ్లీ సంవత్సరం వరకుఎదురు చూడాల్సిందే! అంతగా ప్రసిద్ధిచెందింది ఆదిలాబాద్ జిల్లా సోలాల బిర్యాని.ఉత్తర తెలంగాణలోనే ఏ జిల్లాలో ఇప్పటి వరకుఎవరికి తెలియని ఓ వంటకం రుచులు దాగిఉన్నాయంటే మీరు నమ్ముతారా? కానీ ఇదినిజం ఆ వంటకం రుచులు కేవలం ఉమ్మడిఅదిలాబాద్ జిల్లాకే సొంతం అవును మరి. ఆరుచుల పేరే తొగరి సోలాల వంటకాలు.అవును మరి అంతగా రుచికరంగా ఉండిచూసిన వారికి అవి నోరూరిస్తాయి. జిల్లాతొగరి సోలాల వంటకం రుచులపై విశాలా భారతి దినపత్రిక అందిస్తున్న ప్రత్యేక కథనం.శీతాకాలం డిసెంబర్ మాసం వచ్చిందంటేచాలు ఉమ్మడి అదిలాబాద్ జిల్లా వ్యాప్తంగాఅందరి ఇంట్లో ప్రతీ ఒక్కరి నోళ్ళలో నీళ్ళుఊరుతాయి. ఎప్పుడెప్పుడు తొగరి సోలాలుతెచ్చుకుని వాటితో వంటకాల రుచులుచూద్దామనే ఆరాటం అందరి మనుసులోఉంటుంది. డిసెంబర్ మాసంలో ఈ తొగరికాయ సోలాలు చేలల్లోకనిపిస్తుంటాయి.గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు ఈ వంటకాలరుచులను ఎంతో ఇష్టంగా ఆస్వాదిస్తారు.ఇప్పుడు వాటి రుచులు పట్టణ ప్రాంతాల్లోకూడ పాకింది. ముఖ్యంగా పల్లె ప్రాంతాల్లో ఈతొగరి సాలాల వంటకం లేని రోజే ఉండదంటేఅతిశయోక్తి కాదు. ఉత్తర తెలంగాణలోనేకేవలం ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోనే అంతఫేమస్ అయిన వంటకం తాతల ముత్తాతల కాలం కొన్ని పిడీల నుంచి ఈ తొగరి సోలాలవంటకాల రుచుల ఆదరణ కొన సాగుతూవస్తుంది. వీటి వంటకాల రుచులు కేవలంఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో తప్ప మరిఇంకెక్కడా కనిపించవు. అందులో ఆదిలాబాద్జిల్లాలో వందకు వందశాతం ప్రతీ ఇంటిలోఇప్పుడు ఈ వంటకాల రుచులే దర్శనంఇస్తుంటాయి. అది కూడా జనవరి మాసంవరకే మళ్లీ ఆ రుచులు చూడాలంటేసంవత్సరం వరకు వేచి చూడాల్సిందే. అతిథులు వస్తే సోలాల బిర్యానిచాల్సిందే..మన ఇంటికి ఎవరైనా చుట్టం చూపుగాఅతిథులు వస్తే వారికి ఈ తొగరి సోలాలబిర్యాని వండి పెట్టాల్సిందే కొంత మందిఅతిథులు చుట్టాల ఇంటికి వెళ్ళినప్పుడు అడిగిమరీ ఈ బిర్యానీ చేయించు కునిలొట్టలేసుకుంటూ తింటుంటారు. ఎందుకంటేఈ తొగరి సోలాల బిర్యాని ఉత్తరతెలంగాణలోనే ఎంతో ఫేమస్ ఒక్క ఆదిలాబాద్ జిల్లాలో తప్ప ఈ బిర్యానితెలంగాణా రాష్ట్రంలో మరెక్కడా దొరకదు.ఇక్కడ ఈ బిర్యానికి అంతగా ఆదరణ ఉంది. ఈ తొగరి సోలాలతో పలు రకాలనోరూరించే వంటకాలు జిల్లా ప్రజలు తయారుచేసుకుంటారు. వాటిలో అందరికీ ఎంతోఇష్టం ఐన సోలాల బిర్యానితో పాటు సోలాలవడియాలు, అదేవిధంగా వంకాయ సోలాలు,చిక్కుడు కాయ, సొలాల మధురం, సొలాలాపప్పు ఇంకా తొగరి సొలాలు, మాసాలలోవేయించిన సోలాల కూర, శనక్కూరలో కలిపివండే సోలలు సోలాల కారం, ఉడక పెట్టినసోలాల కాయలు, బోటిలో కలిపి వండేసోలాల కూర,పలు రకాల రుచులతోసొలాలతో నోరూరించే వంటకాలు తయారుచేసుకుని వేడి వేడి జొన్న రొట్టెలతోఆరగిస్తారు.

# భారీగా పెరిగిన నమ్మక ద్రోహం కేసులు

- శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు
- రాష్ట్రంలో ఈ ఏడాది నేరాల సంఖ్య 2.33 శాతం తగ్గిందని వెల్లడించారు
- 2025 సంవత్సరంలో 2.28,69 కేసులు నమోదయ్యాయని తెలిపారు
- పోక్సో చట్టం కింద ఈ ఏడాది 154 మంది నిందితులకు జీవిత ఖైదు
- ఎస్సీ ఎస్టీ చట్టం 28 కేసుల్లో 53 మంది నిందితులకు జీవిత ఖైతు
- 509 మంది మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు



**విశాలభారతి, తెలంగాణ:**

తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయని డీజీపీ శివధర్ రెడ్డి గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో ఈ ఏడాది నేరాల సంఖ్య 2.33 శాతం తగ్గిందని వెల్లడించారు. వార్షిక నివేదిక2025 విడుదల చేసిన సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడుతూ గతేడాది 2,34,158 కేసులు నమోదైతే.. 2025 సంవత్సరంలో 2.28,69 కేసులు నమోదయ్యాయని తెలిపారు. బీఎన్ఎస్ కేసులు 2024 లో 1,69,477 నమోదైతే 2025లో 1,67,018 కేసులు నమోదయ్యాయని, ఇవి గతేడాదితో పోలిస్తే 1.45శాతం తగ్గిందని తెలిపారు. నేర నిరూపణ శాతం - 3.09 శాతం పెరిగిందని, ఇది గతేడాది 35.63 శాతం ఉంటే ఈ ఏడాది 38.72 శాతం ఉందని తెలిపారు. ఈ ఏడాది నాలుగు కేసుల్లో మరణశిక్ష విధించబడిందన్నారు. 216 కేసుల్లో 320 మందికి యావజ్జీవ శిక్ష పడిందని చెప్పారు.

పోక్సో చట్టం కింద నమోదైన మొత్తం 141 కేసుల్లో ఈ ఏడాది కింద నమోదైన మొత్తం 141 కేసుల్లో 154 మంది నిందితులకు జీవితఖైదు విధించబడిందని, 3 కేసుల్లో నిందితులకు మరణ శిక్ష పడిందని తెలిపారు. ఎస్సీ ఎస్టీ చట్టం 28 కేసుల్లో 53 మంది నిందితులకు జీవిత ఖైతు విధించబడిందని తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంతో పాటు, మిస్ వరల్డ్ పోటీలు, ఫుట్బాల్ ఆటగాడు మెస్సీ ప్రోగ్రామ్, వరదలు వంటి విపత్తులను ముఖ్యమైన ఈవెంట్లను తెలంగాణ పోలీస్ సమర్థవంతంగా నిర్వహించిందని చెప్పారు.

ఈ ఏడాది 509 మంది మావోయిస్టులు లొంగిపోయారని, అందులో 23మంది తెలంగాణకు చెందిన మావోయిస్టులు ఉన్నారని డీజీపీ వెల్లడించారు. సైబర్ క్రైమ్ విషయంలో రాష్ట్రంలో 3 శాతం తగ్గిందన్నారు. సైబర్ నేరాలు జాతీయ స్థాయిలో 41 శాతం పెరగగా తెలంగాణలో మాత్రం తగ్గాయన్నారు. ఫోన్ల రికవరీ విషయంలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉందని, రోజుకు సగటున 111 ఫోట్లు రికవరీ అవుతున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హత్యలు 8.76 శాతం తగ్గాయని, అత్యాచారాలు 13.45 శాతం, దోపిడీలు 27, దొంగతనాలు 9.1 శాతం తగ్గాయని డీజీపీ తెలిపారు. నమ్మక ద్రోహం కేసులు 23 శాతం పెరిగాయని వెల్లడించారు. వరకట్నం కోసం మహిళల హత్యలు 2 శాతం తగ్గాయని మహిళా భద్రత కోసం షీ టీంలు యాక్టివ్ పని చేస్తున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసులు 9.5 శాతం తగ్గగా సైబర్ క్రైమ్ కేసుల్లో రికవరీ 23 శాతం పెరిగిందని, ఈ ఏడాది రూ.246 కోట్లు రికవరీ చేశామన్నారు. 24,498 మంది బాధితులకు రూ. 159.65 కోట్లు రిఫండ్ కూడా చేశామన్నారు.

పోలీస్ శాఖలో కీలక పదవుల్లో మహిళా అధికారులు పనిచేస్తున్నారని చెప్పారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఈ ఏడాది వచ్చిన వరదలను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని గతంలో ఎప్పుడూ ఇలాంటి వరదలు నిజామాబాద్ లో రాలేదన్నారు. వరదల సమయంలో పోలీస్ సిబ్బంది బాగా పని చేసి ప్రాణనష్టం లేకుండా చూశారన్నారు. రాష్ట్రంలో వివిధ కేసులను లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో పరిష్కరించామని చెప్పారు. డ్యూటీ మీట్ అండ్ స్పోర్ట్స్ ఈవెంట్లలో తెలంగాణ పోలీసులు తమ సత్తా చాటారని డీజీపీ వెల్లడించారు. జార్ఖండ్ లో నిర్వహించిన 68వ ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ లో తెలంగాణ పోలీసులు 18 పతకాలతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచినట్లు వెల్లడించారు. ప్రపంచ పోలీస్ ఫైర్ గేమ్స్ లో తెలంగాణ పోలీసులు 10 పతకాలు సాధించారాన్నారు. ట్రావెల్ సేఫ్ పేరుతో సీఐడీ నూతన యాప్ తీసుకొచ్చిందని.. మహిళలు, జర్నీ చేసే వారికి ఈ యాప్ చాలా ఉపయోగపడుతుందని సూచించారు. టూరిస్ట్ పోలీసులను ఈ ఏడాది లాంచ్ చేశామన్నారు. 80 మంది నియమించి.. టూరిస్ట్ ప్లేస్‌లో పోలీసులు ఎలా పని చేయాలనే దానిపై ట్రైనింగ్ ఇచ్చామని తెలిపారు. డ్రగ్స్ కట్టడి కోసం ఈ ఏడాది ఈగల్ టీమ్‌ను సీఎం రేవంత్ రెడ్డి లాంచ్ చేశారన్నారు. ఈ ఏడాది 1.20 లక్షల సెల్ ఫోన్లు ట్రేస్ చేయడంలో దేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందని చెప్పుకొచ్చారు. పాస్‌పోర్ట్ వెరిఫికేషన్‌లో దేశంలో తెలంగాణ రెండో స్థానంలో ఉందని వెల్లడించారు.

## ఫ్రీగా ట్రైనింగ్ తీసుకోండి.. జాబ్ చేసుకోండి

- **ఎల్.జి. కంపెనీ సెంట్రల్ మేనేజర్ సంగ్రం కిశోర్**



**కుషాయిగూడ, విశాలభారతి:** యువతకు ఫ్రీగా ట్రైనింగ్ తోపాటు జాబ్ కూడా ఇస్తామని ఎల్.జి. కంపెనీ సెంట్రల్ మేనేజర్ సంగ్రం కిశోర్ అన్నారు. మంగళవారం కమలా నగర్ లో ఉన్న ట్రైనింగ్ సెంటర్ లో నిర్వహించిన పత్రికా సమావేశం నిర్వహించారు. ఉద్యోగాలు లేని యువతీ యువకులకు ఎల్. జి కంపెనీవారు సువర్ణావకాశం కల్పించిందన్నారు. 10వ తరగతి పూర్తి చేసుకున్నా అంతకన్నా ఎక్కువ చదివిన వారు అయినా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. 18 సంవత్సరాలు దాటి 28 వయసుగల వారికి 3 నెలల ట్రైనింగ్ ఉంటుందని, మధ్యాహ్నం భోజన సదుపాయం కూడా కల్పించామని, ఎల్‌జీ హోప్ టెక్నికల్ సైట్ లో అప్లికేషన్ చేసుకోవాలన్నారు. కోర్స్ పూర్తయిన అనంతరం కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన సర్టిఫికేట్, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని పేద విద్యార్థులు, అని వర్గాల వారు ఉపయోగించుకోవాలన్నారు. వివరాలకోసం 9908625756, 8074368668 , 8130438200 నెంబర్లపై సంప్రదించాలని, రెండు తెలుగు రాష్ట్రాల యువకులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెటింగ్ మేనేజర్ డి. రాఘవేంద్ర నాయక్ అన్నారు.

## మల్కాజిగిరి సీపిగా అవినాష్ మహంతి



**మల్కాజిగిరి, విశాలభారతి:** మల్కాజిగిరి సిపిగా బాధ్యతలు స్వీకరించిన అవినాష్ మహంతి ఐపిఎస్. తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన ఆదేశాల మేరకు మల్కాజిగిరి సిపిగా అవినాష్ మహంతి మంగళవారం భాధ్యతలు స్వీకరించారు.

## పెద్దమ్మతల్లి గుడి చైర్మన్ బాలినేనికి పరామర్శ



**విశాలభారతి:** పెద్దమ్మతల్లి దేవాలయం చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు ఇటీవల ప్రమాదవశాత్తు ఆక్సిడెంట్ గురై, ఖమ్మంలో శాస్త్ర చికిత్స చేయించుకున్నారు.ఆయన ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అయి పాల్వంచ మండలం పరిధిలోని సోములగూడెం వచ్చిన సందర్భంగా మంగళవారం రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డి సి ఎం ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాస రావు పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాలే జానకిరెడ్డి, కోండం వెంకన్న గౌడ్, ఎస్వీ ఆర్కే ఆచార్యులు, వై.వెంకటేశ్వర్లు , చింతా నాగరాజు, మాలోత్ కోటినాయక్, డిష్ నాగేశ్వరరావు, భావ్ సింగ్, కూరాకుల వెంకన్న, సోములగూడెం ఉప సర్పంచ్ ఎలికా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచలో ఘనంగా ముక్కోటి ఏకాదశి

- **పాల్గొన్న ఆలయ ఈవో రజినీకుమారి**
- **మాజీ ధర్మకర్త చలవాది ప్రకాష్,రాజ్యలక్ష్మి దంపతులు**



**పాల్వంచ, విశాలభారతి:** ముక్కోటి ఏకాదశి సందర్భంగా పాల్వంచ లోని శ్రీరామాలయ భజన మందిరంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఉత్తర ద్వారా వైకుంఠ దర్శనం ఏర్పాట్లు అతి వైభవంగా జరిగినవి.గుడిలోని ప్రధాన అర్చకులు వంశీ మురళి ఆచార్యులు వచ్చిన భక్తులందరికీ స్వామి వారి విశిష్టత గురించితెలియజేశారు అనంతరం అష్టోత్తర శతనామావళి పూజలు జరిపించారు ఈ కార్యక్రమం లో భక్తులు అశేషంగా తరలివచ్చారు పాల్గొన్నారు. ఆలయకమిటీ వారు వచ్చిన భక్తులకి ఏ లోటు లేకుండా తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ ముక్కోటి ఉత్సవాలకు మాజీ ధర్మకర్త చలవాది ప్రకాష్ రాజ్యలక్ష్మి దంపతులు మరియు తిరుప్పావై కమిటీ సభ్యులు రామభక్తులు అందరూ కూడా స్వామివారి దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారుఈ పర్యవేక్షణ ఏర్పాట్లు అన్నీ కూడా రామాలయ ఈవో రజినికుమారి పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ సిబ్బంది కాశీ ,శివ, నరసమ్మ , రామ భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీగా అక్షాంశ్ యాదవ్



**భువనగిరి, విశాలభారతి:** ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన ఆదేశాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీగా అక్షాంశ్ యాదవ్ మంగళవారం భాధ్యతలు స్వీకరించారు. ఇన్ని రోజులు రాచకొండ కమీషనరేట్ పరిధిలో ఉన్న యాదాద్రి భువనగిరి జోన్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా యాదాద్రి భువనగిరి జిల్లాగా ఏర్పాటు అయింది. ఈ మేరకు ఇప్పటి వరకు డీసీపీగా భాద్యతలు నిర్వర్తించిన అక్షాంశ్ యాదవ్ ఎస్పీగా భాద్యతలను స్వీకరించారు.

## వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

- **మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**



**కోదాడ, విశాలభారతి:** వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని మునగాల మండలం, భారాఖాతుగూడెం గ్రామము లోని శ్రీ స్వయంభు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ స్వామి వారి ఆశీస్సులతో కోదాడ నియోజకవర్గం ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతుని ప్రార్థించినట్లు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

## ఉచిత నట్టాల నివారణ మందుల పంపిణీ



**నిజామాబాద్, విశాలభారతి:** మాక్లూర్ మండలంలోని కొత్తపల్లిగ్రామంలో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మేకలు గొర్రెలకు ఉచిత నట్టాల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు . కొత్త పల్లిగ్రామంలో నట్టాల నివారణ మందుల పంపిణీ గ్రామ సర్పం వేములపల్లి రత్న కుమారి భరత్ ఉపసర్పంచ్ హనుమాన్లు ప్రారంబించారు. ఈ సందర్భంగా పశువైద్య అధికారి డా. కిరణ్ కుమార్ దేశ్పాండే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఇట్టి సదుపాయాన్ని పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో. వార్డ్ నెంబర్ విట్టల్ నిర్మల బాలరాజు పోశెట్టి పశు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేరుకే వైన్ షాపులు

- **అమ్మకాలన్ని సిండికేట్లలోనే**
- **అలంకార ప్రాయంగా షాపుల్లో అడ్డగోలు బ్రాండ్లు**
- **అన్ని రకాల లిక్కర్ బాటిళ్లు పెట్టనపుడు లైసెన్స్ షాపులెందుకు**
- **మందుబాబుల కష్టాన్ని దోసుకుంటున్న మద్యం వ్యాపారులు**
- **నిద్రావస్థలో ఎక్సైజ్ శాఖ అధికారులు**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, విశాలభారతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో మద్యం వ్యాపాల సిండికేట్ల దందా దినదిన ప్రవర్ధమానంగా వెలుగొందుతోంది. వైన్ షాపులు అలంకారప్రాయానికె పరిమితమయ్యాని మద్యం ప్రియులు ఆరోపిస్తున్నారు. మద్యం దుకాణాలకు టెండర్లు వేసి షాపులను దక్కించుకొన్న వారు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వైన్ షాపుల నిర్వహణను చేపడుతున్నారనే గుసగుసలు గుప్పుమంటున్నాయి. మండలంలో మూడు వైన్ షాపులను దక్కించుకున్న వ్యాపారులు వాటిని పేరుకే నడుపుతున్నారని పలువురు అంటున్నారు. ప్రభుత్వ, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల నిబంధనల ప్రకారం వైన్ షాపులలో అన్ని రకాల పేరున్న మద్యం బాటిల్లను షాపులలో ఉంచాల్సి ఉండగా వ్యాపారులు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా మద్యపాన ప్రియులకు అవసరమైన మద్యాన్ని విక్రయించకుండా వైన్ షాపుల నిర్వహణను కొనసాగించడం కోసమెరుపు.

**సామాన్యులు సేవించే మద్యం బాటిల్లు వైన్ షాపుల్లో ఎందుకు దొరకడంలేదు ? :**

సాధారణంగా మండలంలో మద్యపాన ప్రియులు ప్రతిరోజు క్రమం తప్పకుండా తాగె పేరున్న రాయల్ స్టాక్, ఐబీ, మ్యాన్సహౌస్, ఆఫీసర్ ఛాయిస్, ఎం సి విస్కీ, ఎంసీ బ్రాందీ, బ్లెండర్స్ ప్రైడ్ వంటి మద్యం బాటిల్లు వైన్ షాపుల్లో దొరుకుతున్నాయా అంటే నూటికి నూరు శాతం దొరకట్లేదనే గంటాపదంగా చెప్పవచ్చు. ఎందుకు వైన్ షాపుల్లో ఈ బ్రాండ్ల ను పెట్టడంలేదు ?. వైన్ షాపులను పర్యవేక్షణ చేపట్టాల్సిన ఎక్సైజ్ అధికారులు ఏంచేస్తున్నారు ?. అనే అనేక సందేహాలు మందుబాబులకే కాదు సామాన్యంగా ఆలోచించే ప్రతిఒక్కరికి రావచ్చని, కానీ దింట్లో బుర్ర బద్దలుకొట్టుకుని ఆలోచించాల్సినంత విషయమేమి లేదన్న సంగతి సామాజిక అంశాలపై కనీస అవగాహన ఉన్న ప్రతిఒక్కరికి తెలుసని జనం అంటున్నారు. మరి ఆ మద్యం బాటిళ్లను షాపుల్లో పెట్టక పోవడానికి కారణం ఏమిటన్నది పలువురిలో ఉన్న సందేహం. మద్యం వ్యాపారులు ప్రభుత్వం నిబంధనల ప్రకారం షాపులను దక్కించుకునేందుకు పెట్టినపెట్టుబడులను ప్రభుత్వం విధించిన కాలపరిమితికంటే ముందే రాబట్టుకోవాలంటే మద్యం వ్యాపారులందరు మూకుమ్మడిగా లాభసాటి బిజినెస్ కోసం మందుబాబులపై విచిరిన ఎత్తుగడ మాత్రమే అన్నది జగమెరిగిన సత్యమని పలువురి వాదన.

**మద్యం వ్యాపారులకు ఆయువుపట్టు సిండికేట్:**

కలసివుంటే కలదుసుఖం అన్నమాటకు ప్రత్యక్ష నిదర్శనమే సిండికేటు వ్యాపారమని పలువురు అంటున్నారు. ప్రభుత్వం ద్వారా మద్యంవ్యాపారనికి లైసెన్సులు పొందిన వ్యాపారులు వైన్ షాపుల్లో మందుబాబులకు ఇష్టమైన బ్రాండ్లు పెట్టకుండా వాటిని కేవలం సిండికేగా ఏర్పాటు చేసిన షాపుల్లోనే అచ్చంగా క్వటర్ బాటిళ్ళనే పెదుతున్నారని పలువురు అంటున్నారు. అలా పెట్టిన మద్యంబాటిళ్లను గ్రామాల్లో విచ్చలవిడిగా పుట్టుకొచ్చిన గొలుసు కట్టు (బెల్ట్) షాపు లకు ఒక్కోక్క క్వాటర్ బాటిల్ పై అనధికారికంగా రూ. 20 నుండి 30 రూపాయల వరకు అదనంగా విక్రయిస్తారనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఇలా సిండికేటుద్వారా వ్యాపారం సాగించడం వలన వారుపెట్టిన పెట్టుబడులు అనతికాలంలోనే సంపాదించుకుంటారని, అదే వైన్ షాపుల్లో అన్నిరకాల బ్రాండ్లు పెట్టి ఎంఆర్పీ ధరకు అమ్మితే లాభాలు రాకపోగా పెట్టిన పెట్టుబడులుకూడా రావన్న ఉద్దేశంతోనే వ్యాపారులందరు కూడబలుక్కొని ప్రజల నెత్తిన చేతులుపెట్టి కష్టజీవుల కష్టాన్ని కరెన్సీగా మార్చుకుని అణతి కాలంలోనే మద్యంవ్యాపారం వైపు మల్లినవారు కుబేరులవుతున్నారనే విమర్శలు లేకపోలేదు. వీరి ఆటలు ఇలా సాగుతున్నాయంటే కారణం ఎవరు ? వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేయాల్సింది ఎవరు ? అన్న శతాధిక ప్రశ్నలు ఎన్నిఉన్నా వరెవరన్నది మందుబాబులకు, యావత్ ప్రజానీకానికి తెలుసని ప్రజలంటున్నారు. కట్టడి చేయాల్సిన ఆ శాఖల అధికారుల సహాయసహకారాలతోనే సిండికేట్ల వ్యాపారం నడుస్తోందన్న విషయం ముమ్మాటికీ నిజమని ప్రజలే అంటున్నారు. ఇప్పటికైనా ఆ శాఖ ఉన్నతాధికారులు స్పందించి సిండికేట్ల భరతం పట్టి వైన్ షాపుల్లో అన్నిరకాల మద్యం బాటిళ్లను పెట్టి ఎమ్మార్పీ ధరకు విక్రయాలు చేపట్టేలా చర్యలు చేపడతరా లేదా అన్నది వేసిచూడాలని మండల ప్రజలు అంటున్నారు.

## సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు

- **డిసెంబర్ 31 రోజున విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు**
- **డీజేలు,అధిక శబ్దం వచ్చే బాక్స్ లు వినియోగిస్తే ఉపేక్షించేది లేదు**
- **మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితేపై కేసులు నమోదు**
- **ఎస్పీ రోహిత్ రాజు**




**భద్రాద్రి, విశాలభారతి:** సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రజలకు సూచించారు. నూతన సంవత్సర వేడుకలు సమీపిస్తున్న వేళ జిల్లా ప్రజలు ప్రశాంతమైన వాతవరణంలో వేడుకలను జరుపుకోవాలని సూచించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ తరుపున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. డిసెంబర్ 31 రోజున జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవింగ్ తనిఖీలు నిర్వహించబడుతాయని,నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎర్పాటు చేసే ఎలాంటి కార్యక్రమాలు అయన సరే నిర్వహకులు తప్పనిసరిగా పోలీసు అధికారుల నుండి ముందస్తు అనుమతులు తీసుకోవాలని,అలాగే ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా నిబంధనలకు విరుద్ధంగా డిజేలు,అధిక శబ్దం వచ్చే బాక్స్ లు ఏర్పాటు చేస్తే ఉపేక్షించేది లేదని,తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సైబర్ నేరగాళ్లు నూతన సంవత్సర శుభాకాంక్షల పేరుతో ఫోటోలు,మెసేజ్ లు పంపుతూ బ్యాంక్ అకౌంట్లలో ఉన్న నగదును కాజేయాలని కొత్త కొత్త దారులు ఎంచుకుంటున్నారు.కావునా తెలియని వ్యక్తుల వద్ద నుంచి మెసేజ్ లు వస్తే ఓపెన్ చేయొద్దని ఎస్పీ సూచించారు. అంక్షలను ఎవరైన అతిక్రమించినా, ఉల్లంఘించినట్లుగా ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 100 కు సమాచారం అందించడం ద్వారా తక్షణమే స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోబడుతాయని,ఈ వేడుకలను ప్రజలు,యువత తమ ఇండ్లలోనే తమ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషకరమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేయడం జరుగుతుంది. అదేవిధంగా 2026 సంవత్సరంలో ప్రజలందరికీ మంచి కలగాలని ఆశిస్తూ,జిల్లా ప్రజలందరికీ పోలీస్ శాఖ తరపున ఎస్పీ రోహిత్ రాజు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు

## విజయవంతంగా ముగిసిన కార్యశాల



**హైదరాబాద్, విశాలభారతి:** ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ లో బోధనేతర సిబ్బందికి నిర్వహించిన రెండు రోజుల కార్యశాల రెండో రోజు కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయి. రెండవ రోజు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలు పాలన, వృత్తి నైతికత, నాణ్యతా భరోసా, క్రమశిక్షణ మరియు సిబ్బంది సామర్థ్య అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాయి. రెండో రోజు కార్యక్రమాలను రెండు బ్యాచ్లుగా సమాంతరంగా నిర్వహించగా, ప్రతి బ్యాచ్కు సమర్థవంతమైన భాగస్వామ్యం మరియు కేంద్రీకృత అభ్యాసం లభించింది. బ్యాచ్-2 కార్యక్రమాలు అసెంబ్లీ హాల్లో నిర్వహించబడ్డాయి. ఈ సెషన్లకు డా. ఎం.సి.ఆర్. హెచ్ఆర్డీ ఇన్స్టిట్యూట్ (రిటైర్డ్) ఫ్యాకల్టీ సభ్యులు డి. శివ ప్రసాద్ రిసోర్స్ పర్సన్గా పాల్గొని సంస్థాగత పరిపాలన, పాలనా విధానాలు మరియు సిబ్బంది బాధ్యతలపై రెండు అవగాహనాత్మక ఉపన్యాసాలు అందించారు. ప్రజాపరిపాలన మరియు వృత్తి ప్రవర్తనపై ఆయన ఇచ్చిన ప్రాయోగిక సూచనలు పాల్గొన్న సిబ్బందికి ఎంతో ఉపయోగకరంగా నిలిచాయి. అదే సమయంలో బ్యాచ్-1 కార్యక్రమాలు డిబ్లాక్ సెమినార్ హాల్లో నిర్వహించబడ్డాయి. కార్యక్రమాన్ని సీబీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. వి. నరసింహులు ప్రారంభిస్తూ, సంస్థాగత పాలన మరియు సిబ్బంది బాధ్యతలపై ఉపన్యాసం ఇచ్చారు. ఆయన క్రమశిక్షణ, పారదర్శకత మరియు నిబద్ధత సంస్థల విజయానికి కీలకమని వివరించారు. అనంతరం క్యాంపస్ కన్స్ట్రక్షన్ అడ్వైజర్ శ్రీ పి. శ్రీనివాస శర్మ "సిబ్బంది సామర్థ్యం మరియు కార్యాలయ ఉత్పాదకత" అంశంపై ఆసక్తికరమైన ప్రసంగం చేశారు. తదుపరి సెషన్లలో ప్రొఫెసర్ సురేష్ పబ్బోజు వృత్తి నైతికత, ప్రవర్తన, స్వీయ అవగాహనపై, వైస్‌ప్రిన్సిపాల్ - అకడమిక్స్, సిబిఐటి ప్రొఫెసర్ కృష్ణవేణి నాణ్యతా భరోసా, అక్రెడిటేషన్పై, అదేవిధంగా ప్రొఫెసర్ బి. లింగ రెడ్డి బోధనేతర సిబ్బంది పాత్ర, క్రమశిక్షణ నిర్వహణపై ప్రసంగించారు. ప్రతి సెషన్లోనూ బోధనేతర సిబ్బంది సంస్థ అభివృద్ధి మరియు విద్యా నాణ్యతలో కీలక పాత్ర పోషిస్తారని స్పష్టంగా వివరించారు. మధ్యాహ్నం సమయంలో బ్యాచ్-1 మరియు బ్యాచ్-2 సిబ్బంది అందరూ అసెంబ్లీ హాల్లో సమావేశమై అసైన్మెంట్ సమీక్ష, ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యూఢిల్లీ కేంద్ర ప్రభుత్వ క్యాబినెట్ సెక్రటేరియట్లో డీజీ సెక్యూరిటీ విభాగంలో మాజీ డిప్యూటీ డైరెక్టర్గా పనిచేసిన డా. టి. పి. శశి కుమార్ హాజరై, వృత్తి జీవితంలో అంకితభావం, నైతికత, సేవాభావంపై ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. గౌరవ అతిథిగా ఎంజీఐటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. చంద్ర మోహన్ రెడ్డి పాల్గొని, బోధనేతర సిబ్బంది సామర్థ్యాభివృద్ధికి సీబీఐటీ తీసుకుంటున్న ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి వి నరసింహులు మరియు వైస్‌ప్రిన్సిపాల్ - అడ్మినిస్ట్రేటివ్ సిబిఐటి ప్రొఫెసర్ పి వి ఆర్ రవీంద్ర రెడ్డి ప్రసంగిచారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



**నిజామాబాద్, విశాలభారతి:** మెండోరా మండలంలోని పోచంపాడ్ గ్రామానికి చెందిన బొమ్మల ప్రియాంక వయస్సు 43 సంవత్సరాలు పోచంపాడ్ సోషల్ వెల్ఫేర్ పాఠశాల లో స్టాఫ్ నర్సు గా విధులు నిర్వహిస్తుంది. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో భోజనం చేసి తన తమ్ముడితో ద్విచక్ర వాహనంపై విధి నిర్వహణకై పాఠశాలకి వెళ్తుండటగా వెనకవైపు నుండి వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ వేముల మహేష్ తన ట్రాక్టర్ ను అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ద్విచక్ర వాహనానికి ఢీ కొట్టగా వాహనంపై ఉన్న ప్రియాంకకు గాయాలు కావడంతో నిర్మల్ ఆసుపత్రికి తరలిస్తున్న సమయం లో ఆమె చనిపోయినట్లుగా మృతురాలి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు నిమిత్తం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జాదవ్ సుహాసిని తెలిపారు.

## భూ భారతి రికార్డులు పరిశీలించిన సబ్ కలెక్టర్



**నిజామాబాద్, విశాలభారతి:** మండలంలోని కేశ్ పల్లి గ్రామంలో రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న భూ భారతి కి దరఖాస్తు చేసుకున్న రైతుల సమస్యల పరిష్కర కార్యక్రమాన్ని మంగళవారం ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వీయ పరిశీలించారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి పథకం కింద నిజామాబాద్ జిల్లాలో భూ భారతి పథకం కింద ఆన్లైన్లో అత్యధికంగా దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు దారులు కేశ్ పల్లి గ్రామములో ఉండడంతో జిల్లాలో కేశ్ పల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వ అధికారులు ఎంపిక చేశారు. దాంట్లో భాగంగా గత మూడు రోజుల నుండి మండల రెవెన్యూ అధికారులు, గ్రామంలోనే ఉండి భూమి యొక్క రెవెన్యూ వివాదాలను పరిష్కరించడంలో అధికారులు నిమగ్నై ఉన్నారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజల సమస్యలను ఏ విధంగా పరిష్కరిస్తున్నారనే విషయాలను ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వీయ ఆకస్మికంగా పర్యటించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్మయి, ఆర్ఐ ప్రవీణ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## బ్యాంకు ఉద్యోగులు ఆందోళన




**కోదాడ, విశాలభారతి:** ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వారానికి ఐదు రోజుల పని దినాలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ దేశవ్యాప్త నిరసనలో భాగంగా కోదాడలో అన్ని బ్యాంకుల యూనియన్లు ఆందోళన చేపట్టాయి. మంగళవారం సాయంత్రం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బిఐ) ప్రధాన శాఖ ఎదుట వివిధ బ్యాంకుల ఉద్యోగులు, సిబ్బంది పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఐదు రోజుల పని దినాల డిమాండ్ ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉందని, కేంద్ర ప్రభుత్వం దీనిపై మొండి వైఖరి వీడాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బ్యాంకుల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, దీనివల్ల ఉన్న ఉద్యోగులపై పని ఒత్తిడి విపరీతంగా పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి, కొత్త నియామకాలు చేపట్టాలని వారు కేంద్రాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకుల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో మేనేజర్ శివకుమార్, చీఫ్ మేనేజర్ వీరస్వామి, వెంకటరత్నం, ఉమా మహేష్, చిట్టిబాబు, రాము, నందన్ రెడ్డి, సౌజన్య, రమ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వార్డు మెంబర్ తాళ్లపల్లి వేణుకు సన్మానం



**దేవరుప్పుల, విశాలభారతి:** హైదరాబాదులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం గాంధీ భవన్ లో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈరోజు ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన సర్పంచులు, వార్డ్ మెంబర్లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఇన్చార్జి ఎండి ఖలీద్, రాష్ట్ర అధ్యక్షుడు జెక్కిడి శివ చరన్ రెడ్డి, జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బోనాసి క్రాంతి, పాల్గొని జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజు పల్లి గ్రామ వార్డు మెంబర్ తాళ్లపల్లి వేణు గారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు సేవ చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వార్డ్ మెంబర్ తాళ్లపల్లి వేణు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి గెలిపించిన గ్రామ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ అన్ని విషయాల్లో ప్రజలకు తోడు నిలబడతానని, హామీ ఇచ్చారు.

# మల్కాజిగిరి తొలి కమిషనర్‌గా అవినాష్ మహంతి




**మల్కాజిగిరి, విశాలభారతి:** కొత్తగా ఏర్పాటైన మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్‌కు తొలి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అవినాష్ మహంతి ఐపిఎస్. అనంతరం నేరడ్మేట్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ పనితీరు, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణపై దృష్టి సారిస్తామని తెలిపారు.కమిషనరేట్ పరిధిలో నేరాలను నియంత్రించడం, ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడం, మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అలాగే ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ, సమస్యలను వేగంగా పరిష్కరించేలా పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతలు పటిష్టంగా ఉండేలా అన్ని విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుని పని చేస్తామని ఆయన తెలిపారు.

# ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్‌గా సుధీర్ బాబు




**రంగారెడ్డి, విశాలభారతి:** నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్ గా మంగళవారం సుధీర్ బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నేను ఈ రోజు ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించడం జరిగిందని, రాష్ట్ర అభివృద్ధిని ప్రపంచ దేశాలకు తెలిసేలా ఇటీవల గ్లోబల్ సమ్మిట్ ను నిర్వహించుకోవడం జరిగినదని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా కొత్తగా నాలుగు పోలీసు కమిషనరేట్లను ఏర్పాటు చేయడం జరిగిందని, అందులో భాగంగా నేను ఈ రోజు ఫ్యూచర్ సిటీ పోలీసు కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించడం జరిగిందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో తమ వంతు బాధ్యతలను నిర్వహిస్తామని అన్నారు. అన్నీ శాఖల సమన్వయంతో పని చేస్తామని, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో 22 పోలీసు స్టేషన్లు పని చేస్తాయని, ఈ పోలీసు స్టేషన్ల అధికారులతో కలిసి టీమ్ వర్క్ తో సమర్ధవంతంగా పని చేస్తామని అన్నారు. నాకు ఈ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# కోనోకార్పస్ చెట్లను దయచేసి తొలగించండి

- అర్బన్ బయోడైవర్సిటీ అధికారులను కోరిన నెమలి అనిల్ కుమార్
- శక్తి సాయి నగర్ కాలనీ పార్క్ లోని ప్రాణాంతకమైన కోనోకార్పస్ చెట్ల తొలగింపు



**నాచారం, విశాలభారతి:** శక్తి సాయి నగర్ డివిజన్ లోని శక్తి సాయి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జెస్సి,ప్రధాన కార్యదర్శి సుధాకర్ మరియు కాలనీ వాసుల ఫిర్యాదుల మేరకు శక్తి సాయి నగర్ కాలనీ పార్క్ లో గత ప్రభుత్వం పార్క్ సుందరీకరణకు వాడిన కోనోకార్పస్ చెట్ల వలన కాలనీ లో పలువురికి శ్వాస సంబంధిత వ్యాధులు రావడంతో అనారోగ్యానికి చేసే ఈ చెట్ల తొలగించాలని కోరడం జరిగింది వెంటనే సంభందిత యు బి డి అధికారులకు ఫిర్యాదు చేయడంతో పార్క్ లోని కోనోకార్పస్ చెట్లను తొలగించడం జరిగింది. కోనోకార్పస్ అనేది ఒక ప్రమాదకరమైన మరియు ప్రాణాంతకమైన చెట్టు,ఈ చెట్లు సి ఓ వాయువును వదిలి జీవులను శ్వాసకోశ సమస్యలకు గురిచేసి అనారోగ్యానికి చేస్తాయి ఇవేకాకుండా చెట్టుతో పర్యావరణానికి విఘాతం, దుష్పరిణామాలు అలాగే కేబుల్,డ్రైనేజీ,మంచినీటి పైపులైన్లకు లక్షల్లో నష్టం చేసే చెట్టు ఈ కోనోకార్పస్ చెట్టు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో జరిపిన హరితహారం కార్యక్రమానికి ఎక్కువ శాతం ఈ కోనోకార్పస్ చెట్లనే వాడడం గమనార్హం అని గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ తెలిపారు ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి వి.శ్రీనివాస్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు.కే.రాజేష్,రాకేష్,యాసీన్,రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు



**మేడిపల్లి, విశాలభారతి :** ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జీహెచ్ఎంసీ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ పీర్జాదిగూడ డివిజన్ రాఘవేంద్ర నగర్‌లో ఉన్న శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో . బుద్ధానగర్ శ్రీ షిరిడి సాయిబాబా దేవాలయంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించి, రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మధుసూదన్ రెడ్డి, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు ప్రభు, ఏఐఎస్ఎఫ్ నాయకులు పుట్ట లక్ష్మణ్,శంకరయ్య, రాజశేఖర్ రెడ్డి, నర్సి రెడ్డి, బొందుగుల కృష్ణ రెడ్డి, రవీందర్ రెడ్డి, చింతల నరసింహ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చిరంజీవి రెడ్డి, సంతోష్ రెడ్డి, సుశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాకునూరులో ముక్కోటి ఏకాదశి వేడుకలు



**కేశంపేట, విశాలభారతి:** ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలపరిధిలోని కాకునూరు గ్రామంలో గురుబోధ రంగయ్య ఆధ్వర్యంలో వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.గ్రామానికి చెందిన దేశగౌని జగదీశ్వర్ గౌడ్ - ప్రేమావతి దంపతులు గీతా పారాయణం, విష్ణు సహస్రనామాలు, లక్ష్మీ అష్టోత్తరాలు, హనుమాన్ చాలీసా, గోవింద నామాలు, భజన సంకీర్తనలు నిర్వహించారు.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో హరికిషన్ రెడ్డి,శంకర్ జీ,నర్సింహారెడ్డి,సంతోష్ కుమార్ చారి,అంజయ్యచారి, గుత్తి రంగయ్య, శ్రీనివాస్ గౌడ్, మల్లారెడ్డి, జంగారెడ్డి, రామచంద్రయ్య,అనసూయమ్మ, అలివేలమ్మ,ప్రేమమ్మ,జానకమ్మ, అనిత,సరస్వతి,రాములమ్మ, లక్ష్మమ్మ,నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అడ్వకేట్ చుంచు బాల్ రెడ్డికి దక్కిన గౌరవం



**ఎల్బీనగర్ విశాలభారతి:** కేంద్ర ప్రభుత్వ అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడుగా నియమితులైన అడ్వకేట్ చుంచు బాల్ రెడ్డి నియమితులైయ్యారు. బాల్ రెడ్డి న్యాయవృత్తికి ఆయన అందించిన విశేష కృతజ్ఞతలు తెలియజేస్తూ, కేంద్ర ప్రభుత్వ కేసుల్లో సేవలు, న్యాయపరమైన నైపుణ్యం, ప్రజాసేవ పట్ల న్యాయసూత్రాలకు కట్టుబడి బలమైన, సమస్యలు ఆయన చూపుతున్న అంకితభావాన్ని ప్రశంసిస్తూ న్యాయసేవలు అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా అడిషనల్ స్టాండింగ్ కౌన్సిల్ గా నియమితులైన బాల్ రెడ్డి మాట్లాడుతూ తనపై ఉంచిన విశ్వాసానికి, నమ్మకాన్నికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# డీజేలకు అనుమతులు లేవు

- అనుమతులు లేనిదే ఈవెంట్స్ నిర్వహించరాదు
- ఫామ్ హౌస్‌లు, రిసార్టులు నిబంధనలకు లోబడి వ్యవహరించాలి
- మైనర్ డ్రైవింగ్ చేసిన తల్లిదండ్రులపై కేసులు తప్పవు
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్




**విశాలభారతి, ఆదిలాబాద్:**

జిల్లావ్యాప్తంగా 31 డిసెంబర్ రాత్రి వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు, ప్రజలు పోలీసులు సూచించినటువంటి సూచనలను పాటించాలని ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. 31 రాత్రి మరియు నూతన సంవత్సరం సందర్భంగా యువత ప్రశాంత వాతావరణంలో నిబంధనలకు లోబడి వేడుకలను నిర్వహించుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా వేడుకలు నిర్వహణ చేపట్టాలని తెలిపారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా జిల్లా పోలీసు వ్యవస్థ పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 30 డ్రంక్ అండ్ డ్రైవ్ చెక్పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్లు, ముఖ్యంగా పట్టణంలో 15 చెక్పోస్టులను ఏర్పాటు చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారి వాహనాలు సీజ్ చేస్తూ, వారిపై చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. వాహనదారులు రాంగ్ సైడ్ డ్రైవింగ్, రేష్ డ్రైవింగ్, స్పీడ్ రేసింగ్ లాంటివి చట్ట విరుద్ధమని తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపినట్లు అయితే వారిపై మరియు వారి తల్లిదండ్రులపై కేసులు తప్పవని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డీజే లకు అనుమతులు లేవని, నూతన సంవత్సరం సందర్భంగా రోడ్లపై కేక్ కటింగ్ లు చేస్తూ ఉన్న వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇళ్లపై సౌండ్ బాక్స్ లతో, మైక్ సిస్టంలతో వేడుకలను నిర్వహించేవారు కచ్చితంగా పోలీస్ అనుమతులను తీసుకోవాల్సిందని సూచించారు. అనుమతులు లేనిదే ర్యాలీలు, సభలు, సమావేశాలు, ఈవెంట్లు, ప్రోగ్రామ్లను నిర్వహించరాదని, జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని తెలిపారు. ఎలాంటి ప్రైవేటు ఈవెంట్లను నిర్వహించాలన్న వారు ఎక్సైజ్ శాఖ పోలీస్ శాఖ అనుమతులను తీసుకోవాలని తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో టపాకాయలు వెలిగించరాదని తెలిపారు. యువత నిబంధనలకు లోబడి వ్యవహరించాలని పట్టణాల్లో రేసింగ్ లో చేస్తూ పట్టుబడితే పోలీసు చర్యలు తప్పమన్నారు. ప్రతి మండల పరిధిలో ఒకే విధమైన నిబంధనలు ఉంటాయని తెలిపారు.

# విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించాలి




- పట్టణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఎన్.ఆర్.ఎస్ అకాడమీ
- అకాడమీ తరుపున స్కూల్ స్థాపించడం అభినందనీయం
- సీ.బీ.ఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వీ.లక్ష్మీనారాయణ

**కోదాడ, విశాలభారతి:**

ప్రస్తుత సమాజంలో విద్యార్థులకు ఇంటర్మీడియట్ కోర్సు కీలకమని, ఆ సమయంలో విద్యార్థులు పట్టుదలతో చదివి ర్యాంకులు సాధించి వారి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సీ.బీ.ఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వీ.లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని ఆర్.ఎస్.వీ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఎన్.ఆర్.ఎస్.ఐ.ఐ.టీ, మెడికల్ అకాడమీ 3వ వార్షికోత్సవ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కోదాడ వంటి పట్టణ ప్రాంతాలలో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్య అందించి, వారిని జాతీయ స్థాయి ర్యాంకర్లుగా తయారుచేస్తున్న ఎన్.ఆర్.ఎస్ అకాడమీ కృషి అభినందనీయమన్నారు. ప్రతిభ ఉన్నప్పటికీ రూరల్ ప్రాంత విద్యార్థులు సరైన ఫౌండేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్ లేక ఇంటర్మీడియట్ లో రాణించలేక పోతున్నారు. దీనిని అధిగమించేందుకు వచ్చే విద్యా సంవత్సరంలో ఎన్.ఆర్.ఎస్ ఫౌండేషన్ స్కూల్ స్థాపించడం హర్షణీయమన్నారు. 8వ తరగతి నుండి ఐఐటీ, నీట్ లకు ఫౌండేషన్ క్లాసులు నిర్వహించి విద్యార్థులను జాతీయ స్థాయి ర్యాంకర్లుగా మార్చేందుకు, వారు జీవితంలో ఉన్నత స్థాయిలో రాణించేందుకు చేస్తున్న ఈ ప్రయత్నం విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అకాడమీ చైర్మన్ వడ్డే రాజేష్ చౌదరి మాట్లాడుతూ తమ సంస్థ ఆవిర్భావం, దానికి గల కారణాలు, సంస్థ లక్ష్యాల గురించి వివరించారు. గ్రామీణ ప్రాంతం నుండి వచ్చిన తాను సరైన ఫౌండేషన్ లేక పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు ఈ అకాడమీ స్థాపించినట్లు తెలిపారు. తమ లక్ష్యాలు సాధించేందుకు తమకు సహకరిస్తున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, లెక్చరర్లకు, సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నూతనంగా స్థాపించే ఎన్.ఆర్.ఎస్ స్కూల్ లోగోలను లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అకాడమీ అడ్వైజరీ చైర్మన్ రవిశంకర్ రెడ్డి, డైరెక్టర్ మనోహర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, అకాడమీ కరస్పాండెంట్ వేణుగోపాల్ రావు, అకడమిక్ అడ్వైజర్ మైనం రామయ్య, ప్రిన్సిపాల్ గంధం వెంకటరమణ (జీ.వీ), వైస్ ప్రిన్సిపాల్ పీ. నాగేశ్వర రావు(పీ.ఎన్.ఆర్), ఏ వో లు మౌనిక, పీ. ఆర్.వో మల్లికార్జున్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# మా కాలనీ స్థలాన్ని కాలనీ అభివృద్ధికే వాడండి



**కమిషనర్‌కు వినతిపత్రంలో విజ్ఞప్తి చేసిన కాలనీవాసులు**

**చౌటుప్పల్, విశాలభారతి:**

పట్టణ కేంద్రంలోని శ్రీ కంటమహేశ్వర కాలనీలో ఆ కాలనికి సంబంధించిన 2980 చ:గ కాళీ స్థలం వున్నది.అయితే ఇటీవల కాలాన చౌటుప్పల్ పట్టణ అభివృద్ధిలో భాగంగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆ ఖాళీ స్థలంలో పార్కు, బహిరంగ వ్యాయామముకు సంబంధించి అభివృద్ధికి నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేయడం ప్రజలందరికి తెలిసిన విషయమే.అయితే ఈ విషయంలో అట్టి నిర్ణయం పై ఆ కాలనీవాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.శ్రీ కంఠమహేశ్వర కాలనీలో రోజురోజుకు ఇండ్లు మరియు జనాభా పెరుగుతున్న సందర్భంగా కాలానికి వాసులకు అంగన్వాడీ కేంద్రం అందుబాటులో లేక చిన్నపిల్లల్ని అంగన్వాడి కేంద్రంలోకి పంపాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని,మరియు పల్స్ పోలియో టీకాలు మరియు నెలల వారి టీకాలుగాని ఇప్పించాలంటే చిన్న పిల్లలతో చాలా దూరం వెళ్లాల్సి వస్తుందని విచారణ వ్యక్తి చేశారు.కావున ఆ ఖాళీ స్థలంలో ఒక కమిటీ హాలు మరియు అంగన్వాడి కేంద్రం నిర్మించగలరని విజ్ఞప్తి చేశారు.కాలనీవాసులు సాంస్కృతిక,నృత్య కార్యక్రమాలు మరియు ఇందు సాంప్రదాయ బద్ధమైన పండుగలను నిర్వహించుటకు అనువైన స్థలం ఈ కాలనీలో మరొక స్థలం లేదని విన్నవించారు. ఇట్టి విషయంపై ఇటీవల కాలనీ పెద్దలు మరియు కాలనీవాసులు కలిసి ఆ స్థలంలో జరుగుతున్న పనులను నిలిపి వేయాలని చౌటుప్పల్ కమిషనర్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది.అదేవిధంగా గతంలో కూడా ఆ కాలనీకి సంబంధించిన ఖాళీ స్థలంలో కొంతమంది రియల్టర్లు కబ్జా చేసేందుకు తీవ్రంగా ప్రయత్నం చేస్తే కాలనీ కి సంబంధించిన కమిటీ పెద్దలు మరియు కాలనీవాసులు అందరం కలిసి అనేక పోరాటాలు చేశామని,చివరకు జిల్లా కలెక్టర్ వద్దకు కుడా వెళ్లి అలా స్థలాన్ని కాపాడమని,ఇప్పుడు అదే స్థలాన్న పార్కు అభివృద్ధి పేరిట ఆ కాలనికి సంబంధించిన ప్రత్యేక స్థలాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లడాన్ని చూసి వాపోతున్నామని తెలిపారు.ఈ స్థలాన్ని ఎట్టి పరిస్థితులలోను కాలనీ అభివృద్ధికే వాడాలని మరే ఇతరతరత్ర వాటికి వాడవద్దని,వాడనివ్వమని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేస్తు పత్రిక సమావేశంలో తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ కంఠమహేశ్వర కాలనీ కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు దర్శనం యాదయ్య,నోముల సత్తిరెడ్డి,గౌరవ అధ్యక్షులు ముప్పిడి సైదులు గౌడ్,ఉపాధ్యక్షులు ఐతగోని వెంకటేశం గౌడ్,కార్యదర్శి రాచకొండ మల్లేష్,సభ్యులు బోల్లెపల్లి వెంకటేష్ గౌడ్,ఐలాపురం కిష్టయ్య,గాదేపట్ల శంకర్ శర్మ శాస్త్రి, ఆదేపు బిక్షపతి,రూపం రమేష్,కడమంచి రాయకల్,గంపల వెంకటరెడ్డి,గాదపట్ల బాలయ్య శాస్త్రి,కడారి ముత్యాలు,భోగ శీను మరియు స్థానికులు పాల్గొన్నారు.

# మూగజీవాల సంరక్షణకు కృషి చేద్దాం

- సంగెం గ్రామ సర్పంచ్ వేణుగోపాలా చారి



**కేశంపేట, విశాలభారతి:** వ్యవసాయం తర్వాత రైతులు అధికంగా ఆధారపడి జీవిస్తున్నది పశుపోషణ పైనే కనుక మూగజీవాల సంరక్షణకు కృషి చేద్దామని సంగెం గ్రామ సర్పంచ్ వేణుగోపాలా చారి అన్నారు.మంగళవారం సంగెం గ్రామంలో 1425 గొర్రెలకు , 25 మేకలకు పశు వైద్యాధికారులు నట్టల నివారణ మందులు వేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పశు సంపదను కాపాడడంలో భాగంగా వాటి సంరక్షణ కోసం టీకాలు,మందులు తప్పనిసరి అని,గ్రామానికి వచ్చి పశు వైద్య సిబ్బంది వేస్తున్న టీకాలను రైతులు తప్పనిసరిగా వేయించడం ద్వారా ఈ అవకాశం సద్వినియోగపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సామయ్య , బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, ఉప సర్పంచ్ షకిల్, వార్డు మెంబర్ సలీం, నాయకులు విష్ణువర్ధనరెడ్డి,వడ్ల బ్రహ్మచారి,పుండరీకం గౌడ్, గన్నోజు యాదగిరిచారి, గౌస్, చాకలి పురుషోత్తం,వాయద్, మన్సూర్,అనిల్, యాదగిరి,ఖాజా, కడారి మహేందర్,కూడలి రాజు, చెన్నయ్య, లక్ష్మయ్య, బేరి సురేందర్, కడారి శ్రీశైలం, బెల్లి శివ,తదితరులు పాల్గొన్నారు.

# కోతకు గురైన రోడ్డుకు మోక్షం

- గ్రామ సర్పంచ్ చొరవతో తీరిన సమస్య
- ఊపిరి పీల్చుకున్న నిర్దవెల్లి గ్రామస్తులు



**కేశంపేట, విశాలభారతి:** మండలపరిధిలోని లేమామిడి నుండి నిర్దవెల్లి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు గతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా కోతకు గురై ప్రమాదభరితంగా మారడంతో నిర్దవెల్లి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గతంలో ఇక్కడ రోడ్డు నిర్మించినప్పుడు వరద నీరు ప్రవహించేందుకు వీలుగా కల్వర్టు నిర్మించకపోవడంతో వర్షాలు కురిసిన ప్రతిసారి రోడ్డు కోతకు గురై గ్రామస్తులను ఇబ్బందులకు గురిచేసింది. ఈ సమస్యపై గ్రామస్తుల రోదనలు చెవిటోని ముందు శంఖం ఊదిన చందంగా మారిపోయాయి. రోడ్డు కోత కు గురైన ప్రదేశంలో ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయి. దీంతో నూతనంగా గ్రామ సర్పంచిగా ఎన్నికైన చెదురువెల్లి భాస్కర్ గౌడ్ సమస్య పరిష్కారానికి నడుంబిగించారు. కోతకు గురైన ప్రదేశంలో మంగళవారం ట్రాక్టర్లతో మట్టిని నింపి తాత్కాలిక మరమ్మత్తులు చేయించారు.త్వరలోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా కృషి చేస్తానని సర్పంచ్ తెలిపారు. మొత్తానికి ఏదో ఒక విధంగా సమస్య పరిష్కారం కావడంతో నిర్దవెల్లి గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రాంతాన్ని స్థానిక సీఐ నరహరి సందర్శించి సర్పంచ్ భాస్కర్ గౌడ్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు రొయ్యల మంజుల జంగేష్, చంద్రయ్య, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొత్త శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ ఖాజాపాషా, నాయకులు బద్క మల్లయ్య ,దిద్దెల ముత్యాలు, కొత్త చిన్న శ్రీశైలం, ఆకుల రామకృష్ణ ,దిద్దెల బాలస్వామి,ఎండి బద్రుద్దీన్, నరేష్, శివశంకర్ ,చంద్రశేఖర్,సురమోని బాలస్వామి,ఆకుల గోపాల్,కటికె మహేష్,దిద్దెల రాజు ,బోడ రాజేష్,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

**కూకట్ పల్లి, విశాలభారతి:** కుకట్పల్లి వివేకానంద నగర్ కాలనీలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా విశేష అలంకరణలో భక్తులకు స్వామివారు దర్శనమిచ్చారు. ముక్కోటి ఏకాదశి కావడంతో కూకట్పల్లిలోని వెంకటేశ్వర స్వామి ఆలయాలన్నీ భక్తులతో కిటికీటలాడాయి. శ్రీవెంకటేశ్వర స్వామి గోవిందా గోవిందా అంటూ నామస్మరణలతో మారముగాయి. ఈ సందర్భంగా వివేకానంద నగర్ ఆలయ అర్చకులు రాఘవచార్యులు మాట్లాడుతూ ఉదయం 3 గంటల నుంచి ప్రత్యేక పాలాభిషేకంతో పాటు స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారాని ఆలయ అర్చకులు తెలిపారు.ఈ సందర్భంగా ఉత్తర ద్వారం నుంచి భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకోవడానికి రావడంతో ముందస్తుగా అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేశామని తెలిపారు.స్వామి వారి దర్శనానికి కూకట్పల్లిలోని వివిధ ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో వచ్చి వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారని ఆలయ అర్చకులు రాఘవచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ చార్యులు,రాఘవాచార్యులు,మనోజ్ కుమార్,కూకట్ పల్లి సీనియర్ జర్నలిస్టు చేగురి మహేందర్,భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.





# ఓటీటీలో 'రాజు వెడ్స్ రాంబాయి' చూడలేదా.. ఇదిగో మీకోసమే ఈ ఆఫర్..

బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని నమోదు చేసిన 'రాజు వెడ్స్ రాంబాయి' ఓటీటీలోనూ రికార్డులు సృష్టిస్తోంది. అఖిల్, తేజస్విరావ్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని సాయిలు కంపాటి తెరకెక్కించారు. రాహుల్ మోపిదేవితో కలిసి దర్శకుడు వేణు ఊడుగుల నిర్మించారు. చైతు జొన్నలగడ్డ, అనిత చౌదరి తదితరులు కీలక పాత్రలు పోషించారు. డిసెంబరు 18వ తేదీ నుంచి తెలుగు ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్ర వీక్షణలు ఇప్పటివరకూ 100+ మిలియన్ స్ట్రీమింగ్ మినిట్స్ దాటినట్లు ఈటీవీ విన్ తెలిపింది. థియేటర్‌లో ఈ మూవీ రన్‌టైమ్ 2 గంటల 15 నిమిషాలు కాగా, ఓటీటీలో ఎక్స్‌టెండెడ్ కట్‌తో అలరిస్తోంది. ఈ సందర్భంగా ఈటీవీ విన్ ఓ ఆఫర్‌ను కూడా తీసుకొచ్చింది. నెలవారీ ప్రీమియం తీసుకునే వారు కోడ్ ఉపయోగించి, ₹50 రాయితీ పొందవచ్చు. అలాగే, కోడ్ ఉపయోగించి, వార్షిక చందాదారులు రూ.100 రాయితీ పొందవచ్చు. 'రాజు వెడ్స్ రాంబాయి' మూవీని మళ్లీ మళ్లీ చూస్తున్న ప్రేక్షకులకు ఈటీవీ విన్ కృతజ్ఞతలు తెలిపింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.